


పాలన అంటే బటన్లు నొక్కడం కాదు.. ప్రజలకు తమ కాళ్ల మీద నిలబడే శక్తిని అందించడం. చేపలు పెట్టడం కాదు.. పట్టాలన్న కార్ల్ మార్క్స్ చెప్పిన మాటల్ని చంద్రబాబు పదేపదే చెబుతారు. ఈ ప్రభుత్వం అదే విధంగా పనిచేస్తోంది. సంక్షేమాన్ని విస్మరించలేదు,సంక్షేమాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


మంగళవారం 10.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 322 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00







## ఉచితంగా రాజముద్రతో

# పట్టాదార్ పాస్ పుస్తకాలు

- రైతుల భూములకు భద్రత కల్పిస్తాం... రైతుల ఆదాయం పెంచుతాం
- 2027 చివరి నాటికి అన్ని రకాల భూ వివాదాల పరిష్కారానికి ప్రయత్నం
- భూ అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతాం... జైళ్లకు పంపుతాం
- గత పాలనలో మంత్రులే ముఠాలు కట్టి భూ అక్రమాలకు పాల్పడ్డారు
- గత పాలకులు కుంభకోణాలు చేశారు... కల్తీ మద్యంతో ప్రాణాలు తీశారు
- నాడు నేరాలు-ఘోరాలు... నేడు అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు
- నంద్యాల జిల్లా కొత్తబురుజులో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో సీఎం చంద్రబాబు



**నంద్యాల(జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని భూ సమస్యలన్నీ పరిష్కరించేలా ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎలాంటి భూ వివాదాలు లేకుండా చర్యలు తీసుకుని... ట్యాంపర్ చేయడానికి ఆస్కారం లేని విధంగా రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని రైతుల భూములకు భద్రత కల్పించడంతోపాటు... వారి ఆదాయాలు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తబురుజులో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు సీఎం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత ప్రభుత్వం రెవెన్యూ శాఖను అస్తవ్యస్తం చేసింది. నాడు మంత్రులే భూ కబ్జాలకు పాల్పడ్డారు. డోన్ లో మంత్రిగా ఉన్న వ్యక్తి ఒక సాధారణ రైతు భూమిని తన అనుచరులకు కట్టబెట్టేశారు. గత ప్రభుత్వంలో 1.95 లక్షల ఎకరాలను 22ఏలో పెట్టారు. ప్రైవేట్ భూముల రికార్డులను తమ ఇష్టం వచ్చినట్టు మార్చేశారు. అడిగిన భూమి ఇవ్వకపోతే 22ఏలో పెట్టేసేలా గత ప్రభుత్వం వ్యవహరించింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చి ప్రైవేట్ భూములపై అజమాయిషీని సొంత వాళ్లకు కట్టబెట్టాలని చూశారు. అప్పీల్ కు వెళ్లడానికి వీలు లేకుండా నిబంధనలు చేశారు. ఇదే జిల్లా పాణ్యం నియోజకవర్గంలో నాటి ప్రభుత్వం తప్పుల తడకగా జారీ చేసిన పట్టాదారు పుస్తకాన్ని కాల్చి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తామని హామీ ఇచ్చాను. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. భూ రికార్డుల్లో తప్పులను సరిదిద్దుతున్నాం. వారసత్వంగా వచ్చిన భూములు, సొంత శ్రమతో కొనుగోలు చేసిన భూములకు చెందిన పుస్తకాలపై నాటి పాలకుల ఫోటోలు వేసుకున్నారు. ఫోటోల పిచ్చితో జీవితాలతో ఆడుకునే పరిస్థితికి వచ్చారు. సర్వే రాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు... రూ.750 కోట్లు ఫోటోలకు ఖర్చు చేశారు. ఎక్కడెళ్లినా భూ సమస్యలపై కట్టకట్టలు అర్జీలు వచ్చాయి"అని సీఎం చెప్పారు.

**రెవెన్యూ వ్యవస్థను గాడిన పెట్టేందుకు 20 నెలలు పట్టింది :** "వాళ్లు చేసిన ఒక దుర్మార్గాన్ని సరిదిద్దడానికి 20 నెలలు పట్టింది. రైతుల సమక్షంలోనే భూ కొలతలు తీసుకుని రైతుల ఆమోదంతో భూ వివరాలతో పుస్తకాలు ఇస్తున్నాం. భూ రికార్డులు తారుమారు చేయకుండా పక్కాగా పట్టా ఇస్తున్నాం. క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. ఎవరు రికార్డులు తారుమారు చేసినా తెలిసిపోతుంది. ఎమ్మార్వో, వీఆర్వోలు తప్పు చేసినా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా తెలిసిపోతుంది. మేం ఇచ్చిన పట్టాదార్ పుస్తకాలను ట్యాంపర్ చేయలేరు. వివాదాల్లేని పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించే బాధ్యత నాది. రాష్ట్ర వ్యాప్తంగా 16,816 గ్రామాలున్నాయి. 6,860 గ్రామాల్లో సర్వే గత ప్రభుత్వంలో చేశారు. తప్పుల తడకతో 19.93 లక్షల పుస్తకాలు ఇచ్చారు. రికార్డులు తారుమారు చేసి ఇచ్చారు. అవన్నీ పక్కనపెట్టి మళ్లీ కొత్తగా రైతులకు పుస్తకాలు అందిస్తున్నాం. గత పాలకులు చేసిన తప్పును సరిదిద్దుతూ ప్రభుత్వమే ఉచితంగా పట్టాలు ఇస్తోంది. రిజిస్ట్రేషన్ విధానం కూడా సులభతరం చేస్తున్నాం."అని సీఎం చెప్పారు.

**భగీరథ స్ఫూర్తితో సీమలో ప్రతి ఎకరాకు నీరు :** "సీమలో ముఠా నాయకులు ఉండేవారు. ఎన్నికల సమయంలో డబ్బుల కంటే బాంబులు అడిగే పరిస్థితి ఉండేది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్భగ్యాలు 2 లో..

## తాగునీటి భద్రతపై

# ప్రభుత్వం అప్రమత్తం కావాలి



- కలుషిత తాగునీటిపై అత్యవసర చర్యలు అవసరం
- రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లకు బీజేపీ 'జనతా వారధి' ద్వారా ఫిర్యాదులు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కలుషిత తాగునీటి కారణంగా వ్యాధుల వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ మేరకు బీజేపీ చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలు, పట్టణాల్లో పార్టీ నాయకులు నిర్వహించిన పర్యటనల సందర్భంగా తాగునీటి కలుషితంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు. తాగునీటి వల్ల డయేరియా, కలరా, సీజనల్ జ్వరాలు వంటి వ్యాధులు పలు ప్రాంతాల్లో నమోదవుతున్నాయని, ముఖ్యంగా ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఘటన రాష్ట్ర ప్రజలను కలవరపెట్టిందన్నారు. అక్కడ కలుషిత తాగునీటి కారణంగా పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చేరడం, మరణాలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని తెలిపారు.

ఆరోగ్య శాఖ సమాచారం ప్రకారం 2019 నుంచి 2024 మధ్య తాగునీటి ద్వారా వ్యాధుల కేసులు పెరుగుతున్నాయని, 2024లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 59 ఘటనలు నమోదయ్యాయని చెప్పారు. 2025లో 21 ఘటనలు చోటుచేసుకున్నాయని, 2026లో కూడా ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఇలాంటి కేసులు వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో జరిగిన డయేరియా వ్యాప్తిలో 70 నుంచి 100 మంది వరకు ఆసుపత్రుల్లో చేరగా ఒక మరణం నమోదైనట్లు తెలిపారు. అధికారిక గణాంకాల్లో నమోదయ్యేవి తక్కువగా ఉండగా, వ్యక్తిగత స్థాయిలో ఎదురైన ఘటనలు అనేకం బయటకు రావడం లేదన్నారు. మిగతా 2లో...



## మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ధర్మవరం నియోజకవర్గంలోని యువతకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పిస్తూ, వారిని దేశ సేవ దిశగా ప్రోత్సహించే ఒక ముఖ్యమైన కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ శ్రీకారం చుట్టినట్లు ఆయన కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సంస్కృతి సేవా సమితి సహకారంతో, మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో, పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటపాటి విద్యా దీవెన కార్యక్రమం ద్వారా సివిల్ సర్వీసెస్ మరియు ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించే కార్యక్రమం ప్రారంభించబడినట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది. ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతిభావంతమైన యువతకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ మరియు వనరులు అందించి వారిని సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత పరీక్షలకు సిద్ధం చేయడం అని మంత్రి కార్యాలయం వివరించింది. -2లో...




## ఎపి మద్యం కుంభకోణం కేసు

# ఇడి విచారణ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎపి మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్య సోమవారం ఇడి విచారణకు హాజరయ్యారు. సుమారు 2 గంటలపాటు జరిగిన విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోయారు. ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం అక్రమాలతో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ. 4 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ అంచనా వేసింది. అప్పట్లో మద్యం విధానాన్ని పూర్తిగా మార్చివేయడం, ముడుపులు ఇచ్చిన వారికే మద్యం తయారీ అవకాశం కల్పించడంపై ఇడి ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ ముడుపుల సొమ్ములు షెల్ కంపెనీల్లోకి మళ్లించి.. అక్కడి నుంచి నిందితుల ఖాతాల్లోకి వచ్చేటట్లు కుట్రపూరితంగా వ్యవహరించారన్న సమాచారంపైనా ఇడి ఆరా తీసింది. మిగతా 2లో...

## 'ఎయిమ్స్'లో డయేరియా... 30 మంది విద్యార్థులకు అస్వస్థత!



2లో

## పశ్చిమాసియాలో చిక్కుకుపోయిన భారతీయులను తీసుకువస్తాం



2లో

## 10 జిల్లాల్లో హెచ్పీవీ టీకా పంపిణీ ప్రారంభం

- 14 ఏళ్ల బాలికలకు మాత్రమే
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి



2లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్ క్యాన్సర్) ముప్పు తప్పించేందుకు 14 ఏళ్ల బాలికలకు ఉచిత హెచ్పీవీ టీకా పంపిణీ సోమవారం పది జిల్లాల్లో ప్రారంభమైంది. మిగిలిన జిల్లాల్లో మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఓ ప్రకటన జారీ చేశారు. కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, పల్నాడు, శ్రీ సత్యసాయి, విజయనగరం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి జిల్లాల్లో టీకా పంపిణీ సోమవారం నుంచి ప్రారంభమైశీదని తెలిపారు. సుమారు 1500 మందికి వాక్సినేషన్ జరిగిందని తెలిపారు.


**1,647 ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు :** రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే)సౌకర్యం ఉన్నట్లు గుర్తించిన 1,647 పీహెచ్సి, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వ్యాక్సిన్ను కేంద్ర ప్రభుత్వం నుంచి వ్యాక్సిన్ను పంపించారు. గ్రామ/ వార్డు సచివాలయాల్లో రికార్డుల ఆధారంగా 14 ఏళ్ల బాలికలు రాష్ట్ర వ్యాప్తంగా 3. 45 లక్షల మంది ఉన్నారని గుర్తించారు. వీరికి మాత్రమే ఈ టీకా వేస్తున్నారు. దీనికి ముందు ఎ. ఎన్. ఎం.లు, ఆశాలు బాలికల సదరు బాలికల తల్లిదండ్రులను కలిసి టీకా ప్రాధాన్యాన్ని సూచిస్తున్నారు. ఏయే ఆరోగ్య కేంద్రాల్లో టీకా వేస్తున్నారో కూడా చెబుతున్నారు. టీకా వేసే సమయంలో తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతిని తీసుకుని యువిన్ యాప్లో నమోదుచేస్తున్నారు. ఆధార్కార్డు నెంబరు ఆధారంగా ఓటీపీ రూపంలో ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. టీకా పంపిణీ ప్రారంభకార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు.



## వాడివేడిగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్ బడ్జెట్ మలి విడత సమావేశాలు సోమవారం నుంచి పున: ప్రారంభమయ్యాయి. పార్లమెంట్ సమావేశాలు.. అత్యంత వాడివేడిగా సాగే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై నేడు సభలో కీలక చర్చతో పాటు ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరగనుండగా.. దీనిపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. కాంగ్రెస్‌కు దీటైన జవాబు చెప్పి తీరుతామని.. ఒక వ్యక్తి మొండితనం కోసమే కాంగ్రెస్ అవిశ్వాసం తెస్తోందని.. మిగతా 2లో...

## బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.50,000 కోట్లు





- ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా ప్రభుత్వ బాండ్ల కొనుగోలు
- ముంచుకొస్తున్న అడ్వాన్స్ టాక్స్, జీఎస్టీ చెల్లింపుల నేపథ్యంలో ముందస్తు చర్యలు
- ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.2.41 లక్షల కోట్ల మిగులు నగదు లభ్యత
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఓఎంఓ ద్వారా రూ.2.50 లక్షల కోట్ల నిధుల పంపింగ్

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను (లిక్విడిటీ) పెంచే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం కీలక చర్యలు చేపట్టింది. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) ద్వారా మార్కెట్‌లోని ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి ఏకంగా రూ. 50,000 కోట్లను బ్యాంకింగ్ సిస్టమ్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ నెలాఖరులో భారీగా అడ్వాన్స్ టాక్స్ (ముందస్తు పన్ను) చెల్లింపులతో పాటు జీఎస్టీ వసూళ్లు జరగనున్నాయి. దీని వల్ల బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి పెద్ద ఎత్తున నిధులు మిగతా 2లో...

## గ్యాస్ బుకింగ్‌పై

# కేంద్రం కొత్త ఆంక్షలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో పారదర్శకతను పెంచేందుకు మరియు దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఒక సిలిండర్ బుక్ చేసిన తర్వాత, తదుపరి సిలిండర్ బుక్ చేసుకోవడానికి మధ్య నిర్ణీత సమయం ఉండాలని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడవచ్చునే భయంతో వినియోగదారులు ముందస్తుగా బుకింగ్స్ చేస్తున్నారు. ఈ పరిణామాలను గమనించిన కేంద్ర ప్రభుత్వం, గ్యాస్ సిలిండర్ల హోర్డింగ్ మరియు బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. మిగతా 2లో...

## తాగునీటి భద్రతపై ప్రభుత్వం అప్రమత్తం కావాలి



(మొదటి పేజీ తరువాయి)

పాత తాగునీటి పైపులైన్లు లీక్ కావడం, డ్రైనేజ్ నీరు పైపుల్లో కలవడం, ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత లోపించడం, నియంత్రణ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధి చేయని బోర్‌వెల్ నీటి వినియోగం వంటి కారణాల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని బీజేపీ నాయకులు 'జనతా వారధి' పర్యటనల్లో గుర్తించారని చెప్పారు.

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్, అటల్ భూ జల్ యోజన వంటి పథకాల ద్వారా రాష్ట్రాలకు నిధులు, సాంకేతిక సహాయం అందిస్తున్నదని తెలిపారు. అయినప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా కలుషిత తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తాగునీటి నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, లీకేజీ ఉన్న పైపులైన్లను మరమ్మతు చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను నియమితంగా శుభ్రపరచాలని, ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లపై కఠిన తనిఖీలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఎండాకాలం నేపథ్యంలో నీటి శుద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర నీటి శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది.

## మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి మొదటిగా మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారం అందించారని, అలాగే డాక్టర్ లక్ష్మయ్య IAS స్టడీ సర్కిల్ సహకారంతో తొలి విడతలో 28 మంది విద్యార్థులకు పూర్తి స్థాయి మద్దతు అందించబడిందని మంత్రి కార్యాలయం వెల్లడించింది. అదేవిధంగా పలువురు ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ సుమారు 200 మంది సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత వసతి మరియు భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారని మంత్రి కార్యాలయం తెలిపింది. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి అందుతున్న సహకారం ఎంతో ప్రోత్సాహకరమని కూడా పేర్కొంది.

ఈ కార్యక్రమం ద్వారా ధర్మవరం నియోజకవర్గ పరిసర ప్రాంతాలకు చెందిన యువతి, యువకులు సివిల్ సర్వీసెస్ తో పాటు ఇతర పోటీ పరీక్షలకు మెరుగైన శిక్షణతో సిద్ధమయ్యే అవకాశం పొందగలరని మంత్రి కార్యాలయం వివరించింది. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన యువత ఉన్నత స్థానాలకు ఎదగడానికి ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా మారుతుందని కూడా పేర్కొంది. సివిల్ సర్వీసెస్ మరియు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఆసక్తి గల యువతి, యువకులు 7842054669, 7998256789 ఫోన్ నంబర్లకు సందేశం పంపి తమ పేరును నమోదు చేసుకోవాలని మంత్రి కార్యాలయం కోరింది. ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ మార్చి 10 అని మంత్రి కార్యాలయం వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల యువతకు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు మార్గదర్శకంగా నిలిచే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## 'ఎయిమ్స్'లో డయేరియా... 30 మంది విద్యార్థులకు అస్వస్థత!



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరి ఎయిమ్స్ యూజి బ్లాక్ హాస్టల్ కు చెందిన సుమారు 30 మంది వైద్య, నర్సింగ్ విద్యార్థిని విద్యార్థులు డయేరియా బారిన పడ్డారు. ఈ నెల 4వ తేది నుండి వాంతులు, విరోచనలు, స్వల్ప జర్వం తో బాధపడుతూ వైద్య శాలలో చిక్సిత నిమిత్తం చేరారు. వైద్య పరీక్షలలో వారికి డయేరియాగా నిర్ధారణ కాగా, వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం అసుపత్రి వర్గాలను వివరణ కోరగా అందరూ డిశ్చార్జ్ అయ్యారని, హాస్టల్ నుండి చికిత్స పోందుతున్నారని తెలిపారు. యూజి బ్లాక్ విద్యార్థులలో కొందరికి డయేరియా ఉండగా, బయటకి వెళ్లి త్రాగిన సందర్భంలో వచ్చిందా అనే దానిపై పరిశీలన చేస్తున్నారు. ఎయిమ్స్ అధికార యంత్రాంగం ఎక్కడ మంచినీరు ఎక్కడ కలుషితం అయిందనే దానిపై తనీఖీలు చేపట్టారు. అనుమానిత వాటర్ లైన్ ను నిలిపివేశారు. యూజి బ్లాక్ లో వేడి నీటిని అందింపచేస్తున్నారు. ఎయిమ్స్ ప్రతినిధులు మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్ద అధికారులకు ఘటనపై సమాచారం అందచేశారు.

**నీటీ నమునాలు సేకరణ**

ఎయిమ్స్ యూజీ బ్లాక్ హాస్టల్ లో డయేరియతో సుమారు 30 మంది అస్వస్దతకు గురి అయిన నేపథ్యంలో మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్ద కమిషనర్ ఆలీమ్ బాషా నీటి సరఫర వ్యవస్దను అధికారులతో కలసి పరిశీలించారు. క్లియర్ వాటర్ ట్యాంక్ వద్ద రెసిడెన్షియల్ క్లోరైన్ పరీక్ష, ఎయిమ్స్ ఫిల్ట్రేషన్ ప్లాంట్ వద్ద హార్ట్ నెస్ పరీక్షలు నిర్వహించగా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు కమిషనర్ తెలిపారు. ఎయిమ్స్ యూజీ బ్లాక్ వద్ద 3 నీటి నమునాలను సేకరించి గుంటూరు రీజనల్ ల్యాబోరేటరీకి పంపించి, భౌతిక, రసాయన, సూక్ష్మ జీవ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంటిఎంసి నుండి ఎయిమ్స్ గెస్ట్ హౌస్ సమీపంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వార 1.5 ఎంఎల్డీ శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నామని అన్నారు. ఎయిమ్స్ లో ఎక్టేవేటేడ్ కార్బన్ ఫిల్టర్స్ , మల్టీ గ్రేయిన్ ఫిల్టర్స్ ద్వార ద్వీతీయ శుద్ధి , ఆర్వో ద్వార తృతీయ శుద్ధి జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఆ నీటిని ఎయిమ్స్ ఆసుపత్రి , క్యాంపస్, హాస్టళ్లు ఇతర విభాగాలకు సరఫరా చేయటం జరుగుందన్నారు. కమిషనర్ వెంట ఎంటిఎంసి ఇంజనీరింగ్ సూపరిండెంట్ లీలా కృష్ణ ప్రసాద్, డీఈఈ రమేష్ బాబు, ఎఈ ప్రవీణ్ సిబ్బంది ఉన్నారు.

## 10 జిల్లాల్లో హెచ్పీవీ టీకా పంపిణీ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

**3 మూడు నెలలపాటు..:** టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు పలువురికి ఇంజెక్షన్ ఇచ్చినచోట నొప్పి, ఎర్రదనం, వాపు, తేలికపాటి జ్వరం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. ఇవి సాధారణంగా 2-3 రోజుల్లో తగ్గుతాయి. హెచ్పీవీ టీకా సురక్షితమైనది. ప్రభావవంతమైంది. భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ను నివారించడంలో హెచ్పీవీ వ్యాక్సిన్ కీలక ప్రాత పోషిస్తుంది మూడు నెలలపాటు టీకా పంపిణీ కార్యక్రమం జరగనుంది.

# ఉచితంగా రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉండకూడదని... ఈ ప్రాంతంలో ముఠా తగాదాలను తుదముట్టించాం. ముఠాలు వద్దు గ్రామాల్లో ప్రశాంతతే ముద్దు అని చెప్పి వైరం ఉన్న నేతలను కలిపాను. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నది నా సంకల్పం. మొదట హంద్రీ-నీవా ఆలోచన చేసింది ఎన్టీఆర్. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. వాటిని నేను పూర్తి చేస్తున్నాను. ఈ డోన్ నియోజకవర్గంలో హంద్రీ-నీవా ద్వారా 30 చెరువులకు నీరిచ్చాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తాం. ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచమంతా ఎగుమతి చేసే సౌకర్యాలు కల్పిస్తాం. అగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం. మామిడికి తెగులు వస్తే పేపర్ కవర్ పెట్టే పద్ధతి తెచ్చాం. మామిడి పండ్లకు తొడిగే కవరుకు 50 శాతం సబ్సీడీ ఇస్తున్నాం. దీంతో నాణ్యత పెరిగింది... లాభాలు వచ్చాయి. కవరు తొడిగిన పండ్లకు రూ.40 వేల దాకా ఆదాయం వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో మామిడికి ధర పెరిగి ఒక టన్నుకు రూ. లక్షా 70 వేల వరకూ ఆదాయం వస్తోంది. మామిడికి రేటు తగ్గితే కేజీకి రూ. 4 సబ్సీడీ ఇచ్చాం. సీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తాం. కేంద్రం రూ.30 వేల కోట్లు పూర్వోదయ పథకం కింద ఇస్తుంది"అని ముఖ్యమంత్రి చెప్పారు.

**విద్యుత్ ఛార్జీలు పెంచబోం :** "సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుంది. నేను కష్టపడేది ప్రజల కోసమే. ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం. జనాభా పెరుగుదలపై దృష్టి పెట్టాం. పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీ తెచ్చాం. పెద్ద కుటుంబమే మనకు రక్ష. పెద్ద కుటుంబాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అధికంగా ఇస్తాం.



అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రైతును రాజు చేస్తాం. టెక్నాలజీ సాయంతో అగ్రి టెక్ ద్వారా ముందుగానే తెగులు పసిగట్టి నివారణ సూచిస్తాం. ఆడబిడ్డలకు దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. స్త్రీ శక్తి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. మెగా డీఎస్సీ నిర్వహించాం. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 23 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ 20 నెలల్లో 6.88 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు చేశాం. పంచాయతీరాజ్ శాఖ రోడ్ల విషయంలో ఉన్న సమస్యలనూ పరిష్కరిస్తాం. రూ.4 వేల కోట్లు పంచాయతీ రోడ్లకు కేటాయిస్తున్నాం. గత పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా ఏంటో ప్రజలు గ్రహించాలి. రాయలసీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయి. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు పెడుతున్నాం. భూగర్భ జలాల పెంపుపై దృష్టి పెడుతున్నాం. గత ప్రభుత్వంలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని మోపారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్ లో కరెంటు చార్జీలు పెంచబోదని హామీ ఇస్తున్నాను.. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. ఒక ఏడాదిలో లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశాం. ఈ ఏడాదికి ఇంకో 5 లక్షలమందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. స్వయం ఏపీ ఏపీ పేరుతో స్వయం సహాయక బృందాల ఉత్పత్తులకు బ్రాండ్ తీసుకొచ్చాం. సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులో వారికి చేయూత కోసం పీ4 అమలు చేస్తున్నాం. డోన్ నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేస్తాం. కొత్త బురుజులో సీసీ రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించడంతో పాటు అర్హులకు ఇళ్లు నిర్మిస్తాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**పాపాలు చేశారు... ప్రాణాలు తీశారు :** "గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. మూడు పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేశాం. రాష్ట్రానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తామన్న మా మాటను నమ్మి అధికారం ఇచ్చారు. నంద్యాల జిల్లాలో పార్లమెంట్ సహా 8 మందిని గెలిపించారు. సీమలో 7 సీట్లు తప్ప అన్నింటా కూటమి అభ్యర్థులను గెలిపించారు. ప్రజాహితం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. గత ప్రభుత్వంలో అన్నీ కుంభకోణాలు, వివాదాలే. 30 వేల మంది కల్తీ మద్యం తాగి ప్రభుత్వంలో చనిపోయారు. ఎక్సైజ్ శాఖలో నెలకు రూ.100 కోట్లు అవినీతి చేశారు. పేదల ఆరోగ్యానికంటే వారికి డబ్బులే ముఖ్యం. ప్రజల జీవితాలు, ఆరోగ్యంతో ఆడుకున్నారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిని కూడా కల్తీ చేశారు. తిరుమల లడ్డూ కల్తీ, మద్యం అవినీతి, భూ దోపిడీ వంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం...

వాటిపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. లడ్డూ విషయంలో సీబీఐ ఇచ్చిన రిపోర్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఉపేక్షించను... ఎవరు చేసినా ఒప్పుకోను. తిరుమల లడ్డుపైనా రాజకీయం చేసి తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఎదురుదాడి చేస్తున్నారు. నేను వెంకటేశ్వర స్వామి భక్తుడిని. 23 క్లైమోర్ మైన్లతో దాడి చేస్తే ఆ వెంకటేశ్వర స్వామే నన్ను రక్షించాడు. వివేకానందరెడ్డిని హత్య చేసి నా చేతిలోనే కత్తిపెట్టి నారాసుర రక్త చరిత్ర అని రాశారు. నేరాలు ఘోరాలు చేశారు. జగన్ చేసిన అన్యాయాన్ని ఆయన సోదరి సునీత తెలుసుకున్నారు. వివేకా కుమార్తె న్యాయం కోసం నేటికీ కోర్టులు చుట్టూ తిరుగుతోంది. ప్రజలు ఏది మంచి ఏది చెడు అనేది ఆలోచించాలి. 2019లో వారిని గెలిపించడంతో రాష్ట్రంలో ఏం జరిగిందో మీరే చూశారు. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు"అని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రజావేదికకు చేరుకునే ముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్య ప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.50,000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

బయటకు వెళ్లే అవకాశం ఉంది. ఈ సమయంలో నగదు లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే ఆర్బీఐ ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకుంది.

దీనిలో భాగంగా వేర్వేరు కాలపరిమితులు ఉన్న పలు ప్రభుత్వ బాండ్లను సెంట్రల్ బ్యాంక్ కొనుగోలు చేసింది. ఇందులో ప్రధానంగా 2035లో మెచ్యూర్ అయ్యే 6.33 శాతం వడ్డీ గల రూ. 13,507 కోట్ల బాండ్లను, 2030లో ముగిసే 6.01 శాతం వడ్డీ గల రూ. 13,494 కోట్ల సెక్యూరిటీలను కొనుగోలు చేసింది. అలాగే 2031 నాటివి రూ. 8,157 కోట్లు, 2053 నాటివి రూ.6,955 కోట్లు, 2033 కాలపరిమితి ఉన్న రూ. 4,479 కోట్ల బాండ్లను తన ఖాతాలోకి వేసుకుంది.

వీటితో పాటు 2039లో ముగిసే రూ.2,304




కోట్లు, 2034 నాటి రూ.1,104 కోట్ల సెక్యూరిటీలను కూడా ఆర్బీఐ సేకరించింది. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో నిధులను మేనేజ్ చేయడానికి ఆర్బీఐ ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం చేస్తుంటుంది.

ఆర్బీఐ తాజా గణాంకాల ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుతం సుమారు రూ.2.41 లక్షల కోట్ల మిగులు నగదు అందుబాటులో ఉంది. పన్ను చెల్లింపుల ద్వారా నిధులు బయటకు వెళ్లినప్పటికీ, వ్యవస్థలో నగదు లభ్యత సురక్షితంగా ఉంటుందని, మిగులు నిధులు రూ. 3.02 లక్షల కోట్లుగా ఉంటాయని అంచనా. కాగా, ఈ క్యాలెండర్ సంవత్సరం ప్రారంభం నుంచి ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా ఆర్బీఐ సుమారు రూ.2.50 లక్షల కోట్లను బ్యాంకింగ్ వ్యవస్థలోకి విడుదల చేయడం గమనార్హం.

## వైసీపీ హయాంలో మహిళల పట్ల ఎన్నో దాష్టీకాలు

- **నిండు సభలో తల్లిలాంటి భువనేశ్వరిని దూషించారు...**
- **తల్లిని, చెల్లిని గౌరవించని వ్యక్తివి నువ్వు**
- **చంద్రబాబును విమర్శించే అర్హత నీకు లేదు**
- **జగన్ పై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం**



**పెనుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలతో పాటు స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుతో కళ్లెదుటే బిడ్డలు ఉద్యోగాలు చేసుకుంటుంటే ఆ తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది... మహిళలను సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. అయిదేళ్లలో జగన్ బస్సు ఛార్జీలు పెంచితే, మేం ఫ్రీ బస్ సౌకర్యం కల్పించి మహిళలకు అండగా నిలిచాం... సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి... ఆయనను విమర్శంచే అర్హతే నీకు లేదు... నువ్వు మహిళా ద్రోహి' అని జగన్ పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అని విరుచుకుపడ్డారు. సొంత తల్లిని, చెల్లిని గౌరవించని వ్యక్తి రాష్ట్రంలో ఇతర మహిళలను ఉద్ధరిస్తారని ఎవరూ భావించడలేదని జగన్ నుద్దేశించి విమర్శించారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీర అంబేద్కర్, అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబేనని అన్నారు. మహిళలను అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంచాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. దీపం పథకం ద్వారా ఏడాదికి ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళను పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవకాశమిస్తున్నారని అన్నారు.

**తల్లిని, చెల్లిని గౌరవించని జగన్... :** సీఎం చంద్రబాబునుద్దేశించి జగన్ విమర్శించడంపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దేవాలయం లాంటి శాసనసభలో తల్లిలాంటి భువనేశ్వరిని జగన్, ఆయన బ్యాచ్ అవమానించిందన్నారు. సొంత చెల్లికి, తల్లికి కూడా న్యాయం చేయలేని వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. బాబాయ్ కూతురైన మరో చెల్లి న్యాయం చేయాలని అడిగినా పట్టించుకోకుండా కోర్టులు చుట్టూ తిప్పుతున్న ప్రబుద్ధుడు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలను, దారుణాలను ప్రజలంతా చూశారన్నారు. రాజధాని అమరావతి ప్రాంత మహిళల పట్ల జగన్ ఏవిధంగా ప్రవర్తించాడో ఎవరూ మరిచిపోలేదన్నారు. ప్రశ్నించిన మహిళలపై కేసులు పెట్టి వేధించిన చరిత్ర ఆయనదన్నారు. ఆయన హయాంలో జరిగిన విధ్వంసం, ఘోరాలపై ఆనాడే గవర్నర్ కు ఒక పుస్తక రూపంలో అందజేశామని గుర్తు చేశారు. అయిదేళ్లలో బస్సు ఛార్జీలు పెంచి ప్రజలపై జగన్ భారం పెంచితే, తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వెన్నదున్నుగా నిలిచిందన్నారు. జగన్ మహిళా ద్రోహి అని మంత్రి సవిత విరుచుకుపడ్డారు.

**రాయలసీమను అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుదే :** అయిదేళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా జగన్, ఆయన బ్యాచ్ కాలం గడిపిందని మంత్రి సవిత మండిపడ్డారు. రాయలసీమ ప్రాజెక్టుల గురించి మాట్లాడే హక్కు జగన్ కు లేదని స్పష్టంచేశారు. అయిదేళ్లలో రాయలసీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కట్టారా... చెరువులను నీటితో నింపారా..? అని ప్రశ్నించారు. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్, పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేస్తున్నారన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తుండడంతో ఉపాధి కోసం వలసలు పోకుండా, తమ కళ్లెదుటే బిడ్డలు ఉద్యోగాలు చేసుకోవడ చూసి, రాయలసీమ ప్రాంత తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని, డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసీపీని ప్రజలెప్పుడో డైవర్షన్ చేశారని, వారి మాటలను ఎవరూ పట్టించుకోవడం లేదని మంత్రి సవిత తెలిపారు.

## ప్రజల నుంచి వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్ లో అందే ఆర్జీలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పరిష్కారంకు జాప్యం జరిగితే తగిన వివరాలను అర్జీదారులకు తెలియచేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగిన పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అర్జీలను తీసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ ప్రజల నుండి అర్జీలు తీసుకొని మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీల పరిష్కారం పట్ల అధికారులు ప్రత్యేక ద్రుష్టి సారించాలన్నారు. సచివాలయం పరిధిలోనే పరిష్కారం చేసే అంశాలపై ఎవరైనా పిజిఆర్ఎస్ కి ఫిర్యాదులు అందిస్తే సంబందిత కార్యదర్శులు, అధికారులపై




చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయాలని, జీరో బియాండ్ ఎస్ఎల్ఏ నిర్వహించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా 55 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 22, రెవెన్యూ విభాగం 17, ప్రజారోగ్య విభాగం 4, అకౌంట్స్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, జి.సాంబశివరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

## ఎపి మద్యం కుంభకోణం కేసు ఇడి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అప్పటివరకు ఉన్న పాపులర్ బ్రాండ్లను పక్కనపెట్టి.. కొత్త బ్రాండ్లను తీసుకురావడానికి గల కారణం ఏంటన్న దానిపై నిందితుల నుంచి ఇడి సమాచారం రాబట్టే ప్రయత్నం చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో తదుపరి విచారణకు రావాలని ఇడి నిర్దేశించింది. ఇక మద్యం కుంభకోణంలో కీలక నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యకు చెందిన రూ.441.61 కోట్లకు పైగా ఆస్తులను ఇడి ఇప్పటికే అటాచ్ చేసింది.

## గ్యాస్ బుకింగ్‌పై కేంద్రం కొత్త ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా గతంలో 15 రోజులుగా ఉన్న రీఫిల్ బుకింగ్ విరామ సమయాన్ని ఇప్పుడు 21 రోజుల నుండి 25 రోజులకు పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

**గృహ అవసరాలకే ప్రాధాన్యత.. :** సాధారణంగా 55 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే వారు కూడా ఇప్పుడు కేవలం 15 రోజులకే బుకింగ్స్ చేస్తుండటంతో ఈ కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. అలాగే డబుల్ సిలిండర్ కనెక్షన్ (ఐదీజ) ఉన్న వినియోగదారులు తమ రెండో సిలిండర్‌ను బుక్ చేసుకోవాలంటే కనీసం 30 రోజుల విరామం ఉండాలని చమురు సంస్థలు స్పష్టం చేశాయి. కమర్షియల్ అవసరాల కంటే గృహ అవసరాలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**కేంద్రం కీలక ఆదేశాలు జారీ.. :** దేశీయంగా గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం అవసర వస్తువుల చట్టం-1955 కింద రిఫైనరీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రొపేన్, బ్యూటేన్ వంటి వాయువులను ఇతర పెట్రోకెమికల్స్ తయారీకి వాడకుండా, కేవలం LPG ఉత్పత్తి కోసమే వినియోగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశంలో సుమారు 25 నుండి 30 రోజులకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, కావున అనవసరంగా ముందస్తు బుకింగ్‌లు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని అధికారులు కోరుతున్నారు.

## వాడివేడిగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్‌పై అవిశ్వాసం విషయంలో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదంటూ రిజుజు మండిపడ్డారు. కాగా.. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే.. రాజ్యసభలో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలపై చర్చించాలంటూ ఖర్గే డిమాండ్ చేశారు. అప్పుడే వంట గ్యాస్ ధరలు పెంచారని, ముందుగా యుద్ధ పరిస్థితులపై చర్చించాలని విపక్షం పట్టుపట్టింది. విపక్షం నిరసనల మధ్యే రాజ్యసభలో కేంద్రం ప్రకటన చేసింది. పశ్చిమాసియా పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని... భారతీయుల భద్రతకు కేంద్రం కట్టుబడి ఉందని జైశంకర్ చెప్పారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. మరోవైపు ... పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపి లు ఆందోళన చేపట్టారు. సస్పెండైన 8 మంది ఎంపి లు ఆందోళన చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ నినాదాలు చేశారు.

## పశ్చిమాసియాలో చిక్కుకుపోయిన భారతీయులను తీసుకువస్తాం



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి రప్పించే ప్రక్రియ కొనసాగుతోందని పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. పలు చోట్ల నుంచి 50 విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. గత 2 రోజుల్లో 100 సర్వీసుల్లో ప్రయాణికులను తరలించినట్లు వెల్లడించింది. దుబాయ్, అబుదాబి, రస్ అల్ ఖైమా, ఫుజైరా, మస్కట్, జెద్దాల నుంచి విమానాలు సురక్షితంగా నడిచాయని ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయా విమానాశ్రయాల్లో పరిస్థితులు, సాధ్యాసాధ్యాలకు అనుగుణంగా విమానాలు నడుస్తున్నట్లు పేర్కొంది. టికెట్ ధరలు సహేతుకంగా ఉండేలా విమాన ఛార్జీలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ వెల్లడించింది.

# ఆస్తిపన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు నగర పరిధిలో సుదీర్ఘ కాలంగా ఆస్తి పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై గుంటూరు నగరపాలక సంస్థ కఠిన చర్యలు చేపట్టిందని, పన్ను బకాయి ఉన్న నివాస గృహాలు మరియు వ్యాపార సంస్థలకు సంబంధించి సోమవారం నగరవ్యాప్తంగా రెవెన్యూ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, సుమారు 70కి పైగా నీటి కుళాయి కనెక్షన్లను తొలగించారని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సమగ్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజలు చెల్లించే పన్నులే అత్యంత కీలకమని, పన్ను బకాయిలపై ఇప్పటికే నోటీసులు, స్లిప్స్ పంపిణీ, మెసేజ్ లు పంపి ప్రజలకు అవగాహన కల్గించామన్నారు. ఆస్తి పన్ను, నీటి కుళాయి పన్ను, వాటర్ మీటర్ చార్జీలు మరియు ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. పన్ను బకాయిలు చెల్లించని వారి పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ట్యాప్ కనెక్షన్ల తో పాటు డ్రైనేజి కనెక్షన్ తొలగిస్తామని, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ట్యాప్ ల తొలగింపుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ల వారీగా ప్రత్యేక సిబ్బందిని కేటాయించామన్నారు. మంగళవారం నుండి పన్నులు చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులను సీజ్ చేయడంతో పాటు, బకాయిల వసూలు కోసం రెవెన్యూ రికవరీ యాక్ట్ ను కఠినంగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్లను, జప్తు నోటీసులు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# రాష్ట్ర మహిళా కమిషన్ నేతృత్వములో మహిళా జన్ సునాయ్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర మహిళా కమిషన్ నేతృత్వములో మహిళా జన్ సునాయ్ కార్యక్రమం మంగళవారం జరుగుతుందని జిల్లా స్త్రీ ,శిశు అభివృద్ధి, మహిళా సాధికారిత అధికారి ప్రసూన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి పాల్గొంటారని చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంభందించిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా జిల్లాల మహిళలు తమ సమస్యలను కమీషన్ దృష్టికి తీసుకొని వచ్చుటకు ఈ అవకాశమును వినియోగించుకోవాలని కోరారు.

# జి రామ్ జి గ్రామీణాభివృద్ధికి నూతన సంకల్పం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : జి రామ్ జి – గ్రామీణాభివృద్ధికి నూతన సంకల్పం అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. వికసిత్ భారత్ – జి రామ్ జి పోస్టర్ ను సోమవారం ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి నూతన సంకల్పం, ఉపాధికి కొత్త హామీగా జి రామ్ జి నిలుస్తుందన్నారు. 125 రోజుల ఉపాధికి హామీ ఇస్తుందన్నారు. సమయానికి కూలీ చెల్లింపు, ఆలస్య చెల్లింపులకు పరిహారం వంటి అంశాలను ఇందులో చేర్చడం జరిగిందని తెలిపారు. గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక రూపొందించుకుని పనులు చేపట్టడం జరుగుతోందని వివరించారు.

125 రోజుల వేతన ఉపాధి హామీ, గ్రామసభ ద్వారా వికసిత్ ప్రణాళిక (విజిసిపి), శక్తివంతమైన నిరుద్యోగ భృతి ఏర్పాటు, నిర్ణీత సమయంలో చెల్లింపులు, ఆలస్యానికి పరిహారం, మెరుగైన హామీ – దృఢమైన నిబద్ధత – సమర్ధ పాలన అదే వికసిత్ భారత్ వంటి ప్రధాన అంశాలకు నిలయంగా ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్: పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ )**: పల్నాడు జిల్లా, వినుకొండ పట్టణంలోని లిప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా ఆలకించిన జీవీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

# దివ్యాంగుల సేవలో 'తదేకం ఫౌండేషన్' అభినందనీయం

- తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రైసైకిల్స్, ఎలక్ట్రికల్ స్కూటర్ పంపిణీ
- రాబోయే రోజుల్లో ఫౌండేషన్ సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడి
- 2027 గోదావరి పుష్కరాల్లోనూ తదేకం ఫౌండేషన్ భాగస్వామ్యం ఉంటుందని ప్రకటన



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్)** : సమాజంలోని అట్టడుగు వర్గాలకు, ముఖ్యంగా దివ్యాంగులకు అండగా నిలవడమే పరమావధిగా 'తదేకం ఫౌండేషన్' అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ కొనియాడారు. సోమవారం నిడదవోలులోని తన క్యాంప్ కార్యాలయంలో తదేకం ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ట్రైసైకిల్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గ్రీన్ రిబ్బన్ కట్ చేసి వాహనాలను ప్రారంభించారు. లబ్ధిదారులు కొప్పాక సీతారాంబాబు, మంత్రి ప్రగడదేవి, దాసరి శివలకు ట్రైసైకిల్స్, అలాగే పిడుగు గోవిందరాజుకు ఎలక్ట్రికల్ స్కూటర్ను అందజేశారు. ఈ పరికరాలను సద్వినియోగం చేసుకుని ఆనందంగా ఉండాలని లబ్ధిదారులను మంత్రి దుర్గేష్ ఆశీం-ర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..ఒక ప్రైవేట్ సంస్థ అయినప్పటికీ సామాజిక బాధ్యతతో తదేకం ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ ఫౌండేషన్ స్థానిక ఇన్చార్జ్ సుధా మరియు వారి బృందం నిడదవోలు నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహకరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల కంటే మిన్నగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ను రూ. 3,000 నుండి రూ. 6,000 కు పెంచిందని మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 15,000 సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తదేకం ఫౌండేషన్ సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని పంపిణీ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల్లోనూ తదేకం ఫౌండేషన్ సహకారాన్ని కోరామని, వచ్చే నెల నుండి దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఇలాగే చేతులు కలిపితే పేదలకు మరింత మేలు జరుగుతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఉగాది ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

- దర్శనం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
- అన్ని విభాగాలు సమన్వయంతో విధులునిర్వర్తించాలి
- క్యూకాంప్లెక్సు, క్యూలైన్లలో నిరంతరం మంచినీరు, అల్పాహారం అందజేయాలి
- భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టాలి
- కార్యనిర్వహణాధికారి : యం. శ్రీనివాసరావు



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్)** : మార్చి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఉగాది మహోత్సవాల సందర్భంగా భక్తులు ముందస్తుగానే క్షేత్రాన్నికి విచ్చేస్తున్నారని కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. భక్తులరద్దీని అనుసరించి దర్శనం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కార్యనిర్వహణాధికారి సూచించారు. ముఖ్యంగా భక్తులు ఎలాంటి అసౌకర్యానికి లోనుకాకుండా ప్రశాంతంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునే విధంగా దర్శనం ఏర్పాట్లు ఉండాలన్నారు. ఉగాది మహోత్సవాల ఏర్పాట్లను సోమవారం కార్యనిర్వహణాధికారివారు సమీక్షించారు. దేవస్థానం కార్యాలయ భవనములోని సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలలో భక్తులందరికీ గతంలో వలనే శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థమైన ఉత్సవాలకు ముందస్తుగా 10 రోజులపాటు విడతల వారిగా స్పర్శదర్శనం కల్పించడం జరుగుతోందన్నారు. ఈ నెల 6 నుంచి స్పర్శదర్శనం కల్పించబడుతోందన్నారు. 15వ తేదీ వరకు రోజుకు నాలుగు విడతలుగా స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా క్యూకాంప్లెక్సు విభాగం, ఆలయ విభాగం పరస్పర సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా విడతలవారిగా స్పర్శదర్శనం, అలంకారదర్శనాన్ని కల్పించాలన్నారు. క్యూకాంప్లెక్సు, క్యూలైన్లలో వేచివుండే భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారాన్ని అందిస్తుండాలని అన్నప్రసాద వితరణ విభాగాన్ని ఆదేశించారు. క్యూకాంప్లెక్సులోని ఫ్యాన్లు, కూలర్లు సజావుగా పనిచేసేవిధంగా తగు పర్యవేక్షణ చేస్తుండాలని ఎలక్ట్రికల్ విభాగాన్ని ఆదేశించారు. సిబ్బంది అందరు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తిస్తుండాలన్నారు. ఇప్పటికే కార్యాలయ సిబ్బందికి అదనపు విధులను కేటాయించడం జరిగిందని, తదనుగుణంగా అధికారులు, సిబ్బంది అందరు కూడా సమయపాలనతో ప్రత్యేక విధులను నిర్వర్తిస్తుండాలన్నారు. క్యూలైన్ల నిర్వహణలో పోలీసుశాఖ వారి పూర్తి సహాయ సహకారాలు పొందాలని ముఖ్యభద్రతాఅధికారిని ఆదేశించారు. ఉత్సవాలకు కాలిబాట మార్గములో అనగా వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట్ల, పెద్దచెరువు, మఠంబావి, భీమునికొలను, కైలాసద్వారం మీదుగా క్షేత్రానికి రావడం జరుగుతున్నదన్నారు. ఇప్పటికే పాదయాత్ర భక్తులు శ్రీశైలక్షేత్రాన్ని చేరుకోవడం జరుగుతుందన్నారు. అటవీశాఖ అధికారుల సమన్వయంతో కాలిబాట ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలిబాటలో భక్తులకు మంచినీటిని అందించడములో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా ఎటువంటి అంతరాయం లేకుండా నీటిసరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు. కాలిబాట మార్గంలోని నాగలూటి, పెచ్చెర్వు, కైలాసద్వారం మొదలైన చోట్ల మరియు శ్రీశైలక్షేత్ర పరిధిలో పలుచోట్ల భక్తులకు అన్నదానం చేసే దాతలకు దేవస్థానం నుండి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాలలో క్షేత్రపరిధిలో కూడా పలుచోట్ల భక్తులు అన్నదానం చేస్తుంటారని, అన్నదాన బృందాలన్నింటికి దేవస్థానం తరుపున ఆయా ఏర్పాట్లను చేయాలని ఇంజనీరింగ్ మరియు అన్నప్రసాద వితరణ విభాగాలను ఆదేశించారు. ముఖ్యంగా అన్నదాన ప్రాంతాలలో పైప్ పెండాల్స్, లైటింగు ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆలయంలో స్వచ్ఛంద సేవలను అందించే సేవకుల స్వచ్ఛందసేవలను తగు సమన్వయంతో వినియోగించుకోవాలన్నారు.

# 11న కాకినాడలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అభివృద్ధి సంక్షేమ ఫలాలు కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలతో పాటు ఊరి చివరికి వెలివేయబడ్డ వారికి సైతం సమానంగా దక్కాలంటే పరిపాలన వికేంద్రీకరణ జరగాలన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆలోచనలకు అనుగుణంగా వైయస్ జగన్ రాష్ట్రంలో సామాజిక న్యాయంతో కూడుకున్న సుపరిపాలన అందించినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర వెల్లడించారు. ఈ నేపథ్యంలో దళితుల ఆత్మగౌరవమైన వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అయితే తప్ప రాష్ట్రంలో సామాజిక న్యాయం.. సమసమానత్వం పరిఢవిల్లవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు అణగారిన వర్గాలన్నీ ఇప్పటికే ఒక నిశ్చిత అభిప్రాయానికి వచ్చాయనీ.. ఈ వాదాన్ని మరింత బలంగా వారిలోకి తీసుకెళ్ళే దిశగా ఈనెల 11వ తేదీన కాకినాడలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సమావేశం జరుగుతుందని.. ఆయన వివరించారు.

సోమవారం వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో గెడ్డేటి సురేంద్ర మాట్లాడుతూ, నిరుపేదలైన ఎస్సీ వర్గాలకు చెందిన ప్రజలు లోగడ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరగాల్సి వచ్చేదనీ.. సిఫార్సు కోసం పెత్తందారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదనీ.. గుర్తు చేశారు. అయితే ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ఫలితంగా ప్రభుత్వ సిబ్బందే స్వయంగా అందరి ఇళ్ళకు వెళ్ళి పథకాల ఫలాలు అందించిన వాస్తవాన్ని ఎవరూ విస్మరించకూడదన్నారు. వైయస్ జగన్ హయాంలో పక్కాగా అమలైన సామాజిక న్యాయానికి అదే చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. అలాగే ఇళ్ళ స్థలాల కోసం, రుణాల కోసం రోడ్డెక్కి రోజుల తరబడి ఆందోళన చేపట్టాల్సిన అవసరం లేకుండానే అన్నింటినీ అమర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ చరిత్ర సృష్టించారని కొనియాడారు.

గతంలో సంపన్న వర్గాల పిల్లలకు మాత్రమే సొంతమైన కార్పొరేట్ స్థాయి ఇంగ్లీష్ మీడియం విద్య, వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అణగారిన వర్గాలకు సైతం ఉచితంగా అందుబాటులోకి వచ్చిన వాస్తవం కూడా అందరికీ తెలిసిందేనని సురేంద్ర పేర్కొన్నారు. ఫలితంగా ఎస్సీ వర్గాలకు చెందిన పిల్లలు బాల కార్మికులుగా మారకుండా ఉన్నత చదువుల బాట పట్టారని తెలిపారు. విద్యారంగంలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన సంస్కరణల వలన ప్రధానంగా లబ్ధిపొందుతుంది ఎస్సీ జాతి పిల్లలే అన్నది అక్షర సత్యమని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో తమ సామాజిక వర్గ సంక్షేమం కోసం, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం మళ్ళీ వైయస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నదే తమ లక్ష్యమని ప్రకటించారు.

అందులో భాగంగానే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకునేందుకు గాను 11వ తేదీన కాకినాడలో విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ముఖ్య ఎస్సీ నేతలంతా హాజరయ్యే ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సమగ్రంగా చర్చించి తగు కర్తవ్యాలను నిర్ధేశించుకుంటామని సురేంద్ర వెల్లడించారు.

సమావేశంలో పలు నియోజకవర్గాల ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రభు, రాజు, చిన్న, ఆలా కిరణ్, నాని, త్రివేణి, కిరణ్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల తల్లులకు సన్మానం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ )**:మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని కాకుమాను మండలం పరిధిలోని వల్లూరు ఎం పి యు పి పాఠశాల నందు విద్యార్థుల తల్లులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పెద్ద ఎత్తున చేర్పించాలని కోరారు. ప్రతి రోజు చేస్తున్న కాంపెయినింగ్ లో భాగంగా తల్లి తండ్రులను అవగాహన కల్పిస్తు పాఠశాలను అభివృద్ధి చేయాలనీ కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు నైతిక విలువలు, సాంస్కృతిక కార్యక్రమం లు, సాంకేతిక విద్య లో విద్యార్థుల బంగారు భవిష్యత్ తీర్చి దిద్దడం జరుగుతుందన్నారు.

# రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)**: సోలార్ కంపెనీ లో భూములు కోల్పోయిన రైతులందరికి నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేసారు. సోమవారం మండల తహసీల్దార్ కు సిపిఐ బృందం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం మండలంలోనీ పలుగురాళ్లపల్లె రెవెన్యూ పొలంలో 303 ఎకరాలు 2023లో సోలార్ కంపెనీకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. అయితే ఈ ప్రభుత్వం లో సోలార్ కి మొదటి విడతగా పలుగు రాళ్ళపల్లె రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 1938 నందు 153 ఎకరాలు, పాపిరెడ్డిపల్లె రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 418 నందు 23 ఎకరాలు మొత్తంగా దాదాపు 175 ఎకరాలు రైతుల భూములను తీసుకోవాలని సోలార్ కంపెనీ వారు రెవెన్యూ అధికారులతో పలు దఫాలుగా భూముల్లో సర్వే చేయడం జరిగింది. అయితే ఈ భూముల్లో 2007 అసైన్మెంట్లో పలుగురాళ్లపల్లె ఎస్సీలకు 101 మందికి, జోకుపల్లె, చెంచయ్యగారి పల్లె, మల్లెపల్లె, పాపిరెడ్డిపల్లె గ్రామ దళితులకు పట్టాలు ఇచ్చారు. అయితే ఆ భూముల్లో పలుగురాళ్లపల్లె ఎస్సిలకు ఇంతవరకు భూములు చూపలేదు. తర్వాత అసైన్మెంట్ జరగక గత 30 నుండి 40 సంవత్సరాలుగా కొంతమంది రైతులు ఈ భూముల్లో సాగులో ఉన్నారు. రైతులు కూరగాయల పంటలు అరటి నిమ్మ తోట మొక్కజొన్న లాంటి పంటలు పండే పొలాల్లో రైతులతో ఏమాత్రం చర్చలు జరపకుండా కనీసం ఆ భూముల్లో పరిశీలన చేయకుండా మొత్తం ప్రభుత్వ భూమి అని సోలార్ కి అప్ప చెప్పడం హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. దీనివలన ఏళ్ల తరబడి ఈ భూమిని నమ్ముకున్న రైతులకు తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉందనీ కాబట్టి జిల్లా కలెక్టర్ ఆ భూముల రైతులతో మీటింగ్ పెట్టి వారికి నష్టపరిహారం ఇప్పించి, అదే విధంగా పలుగురాళ్లపల్లె ఎస్సీలకు 101 మందికి 2007 అసైన్మెంట్ లో ఇచ్చిన పట్టాలకు భూములు చూపించి ఆ తర్వాతనే సోలార్ కంపెనీ వారికి భూములు ఇవ్వాలని అయన డిమాండ్ చేసారు. లేనిపక్షంలో భాదితుల పక్షాన ఆందోళనలు చేస్తామని అయన హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో యంఆర్పియస్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్, వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులు గొల్లపల్లె శ్రీనివాసులు నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ వైకుంఠపురం నిర్వాహణలో... వెరికోస్ వీన్స్ ఉచిత వైద్యశిబిరం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**:వెరికోస్ వీన్స్ ఉచిత వైద్య పరీక్షలకు అనూహ్య స్పందన లభించిందని, పరీక్షలు చేయించుకున్న వారిలో 70మందికి ఆపరేషన్ అవసరం ఉన్న క్రమంలో వారికి హైదరాబాద్ లోని ఏషియన్ వాషిక్యూలర్ హాస్పటల్ నందు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంటపూర్ణచంద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగల ఈ కన్వెన్షన్ నందు ఆదివారం రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం, సుశ్రిత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో,ఏషియన్ వాషిక్యులర్ హాస్పిటల్ వారిచే వెరికోస్ వీన్స్ పరీక్షల ఉచిత క్యాంపు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి సుమారుగా 150 మంది, నరముల వాపు,ఇబ్బందులున్నవారికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 70 మందికి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. వారిని హైదరాబాద్ తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ వైకుంఠపురం అధ్యక్ష కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, ఏషియన్ హాస్పిటల్ డాక్టర్ శుధ, మధు,సాయి తేజ, కోఆర్డినేటర్ సిరవ్ మధు, క్లబ్ ట్రెజరర్ వెంపటి హరిప్రసాద్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ గుమ్మడి ప్రసాద్, సెక్రెటరీ ఎలెక్ట్ మల్లాది అర్జున్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఒకరికొకరు సహాయం చేసుకోవాలి



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ )**:సృష్టికి మూలం మహిళ అని మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఖుద్దుస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,బీజేపీ మైనారిటీ మోర్చా కోస్టల్ ఆంధ్ర జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం మరియు ముస్లిం లకు పవిత్రమైన రంజాన్ నెలను పురస్కరించుకొని పురస్కరించుకొని కాకుమాను మండలంలో కొమ్మూరు మదర్స నందు కాకుమాను పలు ప్రాంతాలలో నిరుపేద లైన మహిళలకు ఉచితంగా చీరలను పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఖుద్దుస్ మాట్లాడుతూ స్త్రీ నిజ జీవితలో అనేక రకాల పాత్రలు పోషిస్తూ గృహిణిగా, ఉద్యోగినిగా, వ్యారావేత్తగా, రాజకీయ రంగాలలో అనేక రకాలుగా పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా ఎదుగుతున్నరన్నారు. తన వంతు సాయంగా పేద మహిళలకు చీరలను పంపిణి చేసినట్లు తెలిపారు. అల్లాహ్ దయతో తనకు కలిగిన దానిలో కొంత పేద ప్రజలకు సాయం చేస్తానని తెలిపారు. అదే స్ఫూర్తితో గత అనేక సంవత్సరాల నుండి ఖుద్దుస్ ఫౌండేషన్ ద్వారా అనేక ఉచిత వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా సేవలు అందించ్చినట్లు తెలిపారు. వనం మనం కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం లు, నిరు పేద విద్యార్థులు చదువుకునేందుకు దాతల సహకారం తో మదర్స ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా సేవా భావంతో ఉంటూ ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఉండాలని కోరారు.

# జాతీయ మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో ఉమెన్స్ డే వేడుకలు

**-అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించిన జాతీయ మానవ హక్కుల మండలి వ్యవస్థాపకులు -చెన్నుపాటి శ్రీకాంత్ -తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మరియు జనరల్ సెక్రెటరీ అమృతం వీర**




మార్చి 09(జర్నలిస్ట్ ఫైల్): తలకొండపల్లి :హైదరాబాద్ అమీర్పేట్ జాతీయ మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.జాతీయ మానవ హక్కుల మండల వ్యవస్థాపకులు చిన్నపాటి శ్రీకాంత్ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్, జనరల్ సెక్రెటరీ అమృతం వీర అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలను రాష్ట్ర,జిల్లాల,మహిళా సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆయిల్ శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని, ఈ సృష్టికి మూలం మహిళ, విద్య, రాజకీయ, అన్ని రంగాలలో మహిళలు ముందుకు రావాలని ఇప్పటికే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తో స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలు రాజకీయ పదవులు అనుభవిస్తున్నారని, మహిళా శక్తికి నిలువెత్తు నిదర్శనం, సామాజిక మార్పుకు దిక్సూచిగా నిలుస్తున్న మహిళా మణులు, మరొకసారి మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆయిల్ శ్రీశైలం గౌడ్,తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ షఫీ బాబా,నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు దన్నోజు సురేష్ చారి మరియు జిల్లా జనరల్ సెక్రెటరీ గన్నోజు ప్రశాంత్ చారి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.




## చిత్రకారిణి శిల్ప కు నారిశక్తి అచీవ్మెంట్ అవార్డు 2026 బహుకరణ




ఖమ్మం, మార్చి 09(జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన చిత్రకారిణి శిల్ప కు రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు స్వరమధురిమ కల్చరల్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో ఈ అవార్డును ఆదివారం ఖమ్మం నగరంలో గల భక్త రాందాస్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అంద చేశారు. చిత్రకారిణిగా అనేక సామాజిక అంశాలపై వేస్తున్న చిత్రాలకు గాను ఈ అవార్డు అందజేశారు. తన ప్రతిభను గుర్తించి అవార్డు అందచేసిన సంస్థ వారికి శిల్ప కృతజ్ఞత తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు నగేష్,ప్రసన్న, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి.



రాజేంద్ర నగర్, మార్చి 09(జర్నలిస్ట్ ఫైల్) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మేగా రైతు మేళలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఎంఎల్ఏ ప్రకాష్ గౌడ్ తదితరులుతో కలిసి పాల్గొన్న శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి నిలువెత్తు నిదర్శనం..

**సామాజిక మార్పుకు దిక్సూచిగా నిలుస్తున్న మహిళా మణులు..**

**-వెల్జాల్ గ్రామంలో పాలకవర్గం సభ్యులకు ఘనంగా సన్మానం**



మార్చి09(జర్నలిస్ట్ ఫైల్): తలకొండపల్లి : తలకొండపల్లి మండలం గ్రామపంచాయతీ భవనంలో సర్పంచ్ వానరాశి రాములమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. పాలకవర్గంలోని మహిళా సభ్యులను, ఆశ వర్కర్లను,అంగన్వాడి సభ్యులను పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎం పి పి సి ఎల్. శ్రీనివాస్ యాదవ్ హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే కేవలం శుభాకాంక్షలు చెప్పుకోవడం మాత్రమే కాదు.. ప్రతి మహిళ తన జీవిత ప్రయాణంలో ఎదుర్కొనే సవాళ్లను, సాధించే విజయాలను గౌరవించుకునే సందర్భం. మహిళలు తమ కలల కోసం సమాజంతోనూ, కొన్నిసార్లు కుటుంబంతోనూ పోరాడాల్సి వస్తుంది.విద్య, ఉద్యోగం లేదా నచ్చిన రంగంలో రాణించడానికి వారు చూపే పట్టుదల ఎందరికో ఆదర్శం.ఓటమి ఎదురైనా తిరిగి నిలబడటం ఆమె నైజం.ఒకే సమయంలో ఒక మహిళ అనేక పాత్రలను పోషిస్తుంది.మహిళలు రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోసిస్తేనే మహిళల అభ్యున్నతి సాధిస్తుందని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళలకు ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉండడంతో గ్రామాల మండలాలలో మహిళలు ఉన్నత పదవులు స్వీకరిస్తున్నారు. మహిళలు ఒకే రోజులో వృత్తి నిపుణురాలిగా ఆఫీసు పనులను సమర్థవంతంగా నిర్వహిస్తుంది.కుటుంబానికి వెన్నెముకగా ఇంటి బాధ్యతలు,పిల్లల పెంపకం చూసుకుంటుంది.క్లిష్ట సమయాల్లో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటుంది.ఒక పురుషుడికి విద్యను అందిస్తే..ఒక వ్యక్తికి మాత్రమే అందుతుంది కానీ.. ఒక మహిళకు విద్యను అందిస్తే.. ఆ కుటుంబం మొత్తానికి అందుతుంది. ఆడపిల్లగా పుట్టినప్పటి నుండి ప్రతి అడుగులోనూ ఎంతో నేర్చుకుంటూ, ఎదుగుతూ సమాజానికి దిశానిర్దేశం చేసే ప్రతి మహిళా ఒక స్ఫూర్తిప్రదాతే. ఆమె లేనిదే ఈ ప్రపంచం లేదు.ఈ క్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెల్జాల్ గ్రామపంచాయతీలో మహిళా సభ్యులను గౌరవించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి,విజయ్ కుమార్,జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజే బార్ రహిమాన్,రిపోర్టర్ విష్ణువర్ధన్ యాదవ్, విజయ్ యాదవ్,మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, యువ నాయకుడు వానరాసి వెంకటేష్,వార్డు సభ్యులు కవిత,ఆంజనేయులు,శేఖర్, శ్రీశైలం,ఎల్లమ్మ,సుభాన్, చెన్నకేశవులు,మన్క లక్ష్మమ్మ వెంకటయ్య,కారోబార్ చంద్రకళ,ఆశ వర్కర్ల,అంగన్వాడి సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు,నాయకులు శ్రీకాంత్, లింగం,రవి,సాయి,గణేష్,గ్రామ పెద్దలు యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో సినీ హీరో ఎన్టీఆర్ క్రేజ్



బెంగళూరు,మార్చి09(జర్నలిస్ట్ ఫైల్):ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వెళ్లిన సినీ హీరో ఎన్టీఆర్‌ను చూడటానికి దారిపొడవునా నిల్చొని 'సీఎం, సీఎం', టైగర్, టైగర్ అంటూ నినాదాలు చేసిన ఆయన అభిమానులు. బెంగళూరులో ఎన్టీఆర్ క్రేజ్, రోడ్ల వెంట బారులు తీరిన ఫ్యాన్స్, 5 కి.మీ. ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ బెంగళూరు పర్యటన అభిమానుల సందడితో హోరెత్తింది. మహాదేవపురలోని కిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన తారక్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎయిర్‌పోర్ట్ నుంచి కార్యక్రమ స్థలం వరకు ఎక్కడ చూసినా అభిమానులే కనిపించగా "టైగర్" అంటూ నినాదాలతో స్వాగతం పలికారు. అభిమానుల తాకిడి కారణంగా కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పడ్డాయి. ఈ పర్యటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మాట నిలబెట్టుకున్న లక్ష్మీ కాంత్ రెడ్డి





(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ మార్చి09 : వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 22వ వార్డు కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చుతో వార్డులో రెండు బోర్లు వేయించారు. ఈ బోర్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి తరఫున ఆనంద్ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బోర్లు ఏర్పాటు చేయడం వల్ల వార్డు ప్రజలకు తాగునీటి సమస్యకు కొంతవరకు ఉపశమనం లభించిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరేష్, సలీమ్‌తో పాటు వార్డు సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని లక్ష్మీకాంత్ రెడ్డిని అభినందించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా మెగా మహిళా రైతు మేళా..ఆరు వేల మంది మహిళా రైతుల హాజరు..

**పాల్గొన్న మంత్రులు తుమ్మల,దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,సీతక్క రైతాంగ సంక్షేమ కోసమే నిరంతరం పని చేస్తున్నామని మంత్రుల ప్రకటన..**




రాజేంద్రనగర్, మార్చి 09 (జర్నలిస్ట్ ఫైల్) : రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరగనున్న మెగా రైతు మేళా ప్రారంభమైంది.పీజేటీఏ యూ,కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్,రాష్ట్ర వ్యవసాయ శాఖలు సంయుక్తం ఈ మేళాను నిర్వహిస్తున్నాయి.అంతర్జాతీయ మహిళా దినోత్సవంని పురస్కరించుకొని,2026ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ మేళాని



ఏర్పాటు చేసారు.రాష్ట్రం నలుమూలనుంచి పెద్ద సంఖ్యలో రైతులు,మహిళా రైతులు,వ్యవసాయ రంగ నిపుణులు,వ్యవసాయ విద్యార్థులు ఈ మేళాకి హాజరు అయ్యారు.ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి నేత్రత్వంలోని తమ ప్రభుత్వం వ్యవసాయం,రైతాంగ సంక్షేమమే ఊపిరిగా నిరంతరం పని చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.ప్రపంచంలోనే తెలంగాణా రైతుని తలెత్తుకుని నిలబడేలా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.దేశంలో ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తర్వాత తమ నేత రాహుల్ గాంధీ ఆలోచనకి అనుగుణం గా సుమారు 25 లక్షల మందికి సుమారు 21 వేల కోట్ల రూపాయల రుణ మాఫీ చేసామన్నారు.గత ప్రభుత్వం లో ఆగిపోయిన రాయితీ విత్తనాలు,వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల్ని పునరుద్ధరించి ప్రారంభిస్తున్నామని తుమ్మల వివరించారు.500 కోట్ల రూపాయల తో పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో మహిళా రైతులకే పెద్ద పీటవేస్తున్నామన్నారు.భవిష్యత్తులో మహిళలకే డ్రోన్ లు అందిస్తామని తెలిపారు.పంటమార్పిడి,సహజ వ్యవసాయ విధానాలని విరివిగా ప్రోత్సహిస్తున్నామన్నారు.ప్రతి జిల్లాలో ఆయిల్ పాం పరిశ్రమని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం రాగానే మూడు కొత్త వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేసామని తెలిపారు.రైతు వేదికల ద్వారా రైతులకి అధునాతన టెక్నాలజీలపై అవగాహన కలిపిస్తున్నామని వివరించారు.రైతు లు తమ ఉత్పత్తులకి విలువ జోడింపుకి తోడ్పడే టెక్నలాజీలని,యాంత్రీకరణల్ని ప్రోత్సహిస్తున్నామని తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.అధునాతన నైపుణ్యాలు,టెక్నాలజీలని ఉపయోగించుకొని ప్రజల అవసరాలకి సరిపడా అహారధాన్యాలని రైతులు పండించాలని రాష్ట్ర ఐ.టీ.,పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.అలాగే భూసార పరిరక్షణ,పంటల వైవిధ్యీకరణల పై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టా లని సూచించారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మన పైన కూడా ప్రభావం పడుతున్న విషయాన్ని గమనించి ఆహారధాన్యాల విషయంలో స్వావలంబన సాధించాలన్నారు.కొత్త వంగడాలు, టెక్నాలజీలని అందుబాటులోకి తీసుకొని వచ్చి వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకి అసమాన సేవ చేస్తున్నదని శ్రీధర్ బాబు ప్రశంసించారు.మెగా రైతు మేళా నిర్వహిస్తున్నందుకు జయశంకర్ యూనివర్సిటీని రాష్ట్ర పంచాయితీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క అభినందించారు.రైతులకు ఉపయోగపడే స్టాళ్లను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియ చేసారు.ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించిందన్నారు.అందరికీ అత్యంత అవసరమైనది ఆహారమని అది అందరికీ అందుబాటులో ఉండాలంటే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగాలన్నారు.ఆహార ఉత్పత్తిలో మహిళలది ప్రధాన పాత్ర అని,60 నుంచి 80 శాతం మంది మహిళలు వ్యవసాయంలో పనిచేస్తున్నారని సీతక్క అన్నారు.విత్తనాలు నాటిన నుంచి పంట కోసి ఇంటికి చేర్చే దాకా ఆడబిడ్డలు చెమటోడ్చుతారని వివరించారు.అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని అయినా మహిళల శక్తికి తగ్గ గౌరవం దక్కడం లేదు సీతక్క అభిప్రాయ పడ్డారు.మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు,వ్యవసాయ అనుబంధ రంగాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పించేందుకు తమ ప్రభుత్వం ఎన్నో పనులు చేస్తోందని సీతక్క వివరించారు.రైతాంగ సంక్షేమానికి తెలంగాణా ప్రభుత్వం అసమాన కృషి చేస్తున్నదని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరక్టర్ జనరల్ ఎం.ఎల్.జాట్ అన్నారు.కొత్త టెక్నాలజీలని రైతాంగాని కి అందుబాటులోకి తీసుకొని రావడంలో తెలంగాణా ఇతర రాష్ట్రాలకి మార్గదర్శకం గా ఉందన్నారు.స్వయాన రైతే వ్యవసాయ శాఖా మంత్రిగా ఉండటం ప్రశంసనీయమని జాట్ అన్నారు.పర్యావరణాన్ని,జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని జాట్ సూచించారు.ఆయిల్ పాం లో తెలంగాణా అద్భుత ప్రగతి సాధిస్తోందని ఇది మారుతున్న పంటల సరళికి మంచి రుజువన్నారు.పంటల వైవి ధ్యీకరణ,కొత్త టెక్నాలజీలని అమలు చేయడం,రైతాంగాన్ని మార్కెట్ లకి అనుసంధానం చేయడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జాట్ సూచించారు.రాష్ట్రం లో ఉన్న ఎనిమిది ఐకార్ సంస్థలు,రెండు ప్రాంతీయ కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వం,పీ జేటీఏయూలతో కలిసి పని చేయడానికి నిరంతరం సిద్ధంగా ఉన్నాయని జాట్ తెలిపారు.భారతదేశ వ్యవసాయ రంగంలో మహిళల వాటా సుమారు 58 శాతం అని పీజేటీఏయూ ఉప కులపతి అల్దాస్ జానయ్య అన్నారు.తమ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందిలో 50 శాతం మహిళలున్నారని,వ్యవసాయ విద్యనభ్యసించే విద్యార్థులలో 70 శాతం అమ్మాయేలనని జానయ్య వివరించారు.మహిళల రైతాంగానికి సాధికారిత కల్పించేందుకు ఈ మెగా రైతు మేళాను నిర్వహిస్తున్నామన్నారు.రసాయన ఎరువులని మితిమీరి వాడటం వల్ల నేల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని జానయ్య అన్నారు.కోటి మంది మహిళలని కోటీశ్వరులని చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనలో మహిళా రైతుల పాత్ర కీలకం అన్నారు.ఈ దిశగా మహిళా రైతులకి శిక్షణ,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలని నిర్వహించనున్నామని జానయ్య తెలిపారు.ఈ సందర్భంగా 30 మంది మహిళా రైతులకి,ఆరుగురు వ్యవసాయ పాత్రికేయులకి మంత్రులు అవార్డులు అందచేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి,ఉద్యాన శాఖ సంచాలకులు శ్రీమతి యాస్మీన్ బాషా,శాసనమండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి,రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్,కోరమాండల్ ఎం.డి.శంకర సుబ్రహ్మణ్యం, ఐకార్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

# గవర్నర్ నిలయంలో ఆత్మీయ వీడ్కోలు



హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ గవర్నర్‌గా పని చేసిన జిష్ణు దేవ్ వర్మకి ఆదివారం సాయంత్రం గవర్నర్ నిలయంలో మంత్రి పొంగులేటి ఘనంగా వీడ్కోలు పలికారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి గవర్నర్‌కు పుష్పగుచ్ఛంతో అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలను నెమరువేసుకుంటూ గవర్నర్ కు హృదయపూర్వక వీడ్కోలు పలికారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచ చిత్ర పటములో చూడ ముచ్చటగా ఉన్నను మణికొండ మాత్రం పేరుకు పెద్ద ఊరు,ఊరు మాత్రం దిబ్బ:ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు ఆరోపణ.




రాజేంద్రనగర్, (జర్నలిస్ట్ ఫైల్) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచ చిత్ర పటములో చూడ ముచ్చటగా ఉన్నను మణికొండ మాత్రం పేరుకు పెద్ద ఊరు,ఊరు మాత్రం దిబ్బ మాదిరి ఉన్నదని ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు ప్రస్తావిస్తూ గత ఐదు సంవత్సరములు మణికొండ కౌన్సిల్ లో కనీసం మహిళల కొరకు షి టాయిలెట్స్ కట్టాలని ఆలోచన కూడా అధికారులకు రాలేదని,ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయాలని చిత్త శుద్ధి లేని ప్రజా ప్రతినిధులు మొత్తం సమయం నిద్రావస్తలో గడిపారని ఆరోపించారు.మణికొండ పరిసర ప్రాంతాలలో ఐటీ కారిడార్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా ఉన్నదన్నది జగమెరిగిన సత్యం కాగా విద్యార్థినులు,ఉద్యోగినులు,గృహ సహాయకులు,వీధి వ్యాపారులు,రోజువారీ బాటసారులు,ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఇక్కడ సంచరిస్తు లఘుశంఖ తీర్చుకోవడానికి ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని,ఇక్కడ ఉన్న ప్రధాన రహదారులైన షేక్ పేట పైప్ లైన్ రోడ్,ఓ యు కాలనీ మర్రిచెట్టు రోడ్,గోల్కొండ చింత చెట్టు అలకాపూర్ రోడ్డు,ప్రాచీన పుప్పాలగూడ రోడ్,మణికొండ జంక్షన్ పుర జనులు కదలాడే ప్రాంతాలల్లో మహిళల కోరకు ప్రజా మరుగుదొడ్లు కేవలం మర్రిచెట్టు జంక్షన్ వద్ద తప్ప వేరే ఎక్కడ మచ్చుకు ఒకటి కూడా లేదని ప్రజలు నిరసనలతో అధికారులపై దుయ్య బడుతున్నారు.స్వతంత్రం వచ్చి 78 సంవత్సరములు అయినను మహిళలకు గౌరవం,ఆరోగ్యం,భద్రత దృష్ట్యా ఆలోచించని అధికారులు రాబోయే కాలంలో ఇబ్బడి ముబ్బడిగా ప్రయశీత్య పడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని,దీంతో సమయం తొందరలోనే వస్తుందని హెచ్చరించడం జరిగినది.ప్రస్తుతం ఈ ప్రదేశమంతా హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అయిన తరుణంలో, అధికారుల ఏలుబడిలో పరిపాలన కొనసాగుతున్న దృష్ట్యా,సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వ అధికారులు విషయమై మానవతా దృక్పథంలో ఆలోచించి సరి అయిన నిర్ణయం తీసుకొని ముందుకు సాగాలని కోరడం జరిగింది.ఒక వేళ స్థానిక ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వం ప్రజాప్రాయొగ కార్యక్రమానికి ముందుకురాని యెడల సదరు అధికారులు స్పందించి సమీప ఐటీ కంపెనీల ద్వారా కార్పొరేట్ సామాజిక బాధ్యత సహకారంతో,మహిళలకు గౌరవ ప్రదమైన,సురక్షితమైన పట్టణ వాతావరణం కల్పించే దిశగా అడుగు ముందుకు సాగుతూ కనీసం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని మణికొండలోని ముఖ్య ప్రాంతాల్లో షి టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఉపేందర్నాథ్ రెడ్డి,అందె లక్ష్మణ్ రావు,సుమనళిని,బొడ్డు శ్రీధర్,దేవిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ ప్రాంగణంలో పునరుద్ధరించిన శాసన మండలి భవనం ప్రారంభం




హైదరాబాద్,మార్చి09(జర్నలిస్ట్ ఫైల్):తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలోని పునరుద్ధరణ చేసిన శాసన మండలి భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో కలిసి రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక ప్రతీకగా నిలిచే ఈ భవనం ఆధునిక నిర్మాణ శైలిలో శాసన మండలి, కమిటీ సమావేశాలు నిర్వహించడానికి ప్రత్యేక హాళ్ల ఏర్పాటుతో పునరుద్ధరణ చేయడం జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు .ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ , శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , సహచర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మృతిని కుటుంబానికి బియ్యం పంపిణీ



వరంగల్ ప్రతినిధి : మార్చి 09 (జర్నలిస్ట్ ఫైల్) : హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బుర్రి సాంబయ్య అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం టీఆర్ఎస్ పార్టీ పత్తిపాక గ్రామ ఉపసర్పంచ్ తుడుం రాజు,వార్డు మెంబర్లు పార్టీ నాయకులతో కలసి 50 కిలోల బియ్యం సమకూర్చగా స్థానిక బాధితులకు అందజేశారు. అనంతరం వారిని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం సమకూర్చారు . మైనార్టీ కుటుంబానికి బియ్యం వితరణ అదేగ్రామంలో .మహమ్మద్ యాకూమియా ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులకు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తుడుం రాజు మరియు వార్డు నెంబర్లు కలసి కలసి మృతిచెందిన కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబాన్ని ఓదార్చి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు,ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నాలిక వీర ప్రతాప్, పోతుగంటి ప్రమీల సారయ్య, గజ్జి రాజు, అంకేశ్వరం సాయి లక్ష్మి మొగిళి, కోడిమాల మహేందర్, గజ్జి రమేష్, గద్దమీది హారతి కర్ణాకర్, ఐరాబోయిన స్వప్న రాజు, కందకట్ల ప్రవీణ్ కుమార్, తుడుం స్రవంతి రాజు, పోతుగంటి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.



రాజేంద్రనగర్, మార్చి 09 (జర్నలిస్ట్ ఫైల్) : మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్యాన్సర్ రహిత సమాజంకోసం మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు ఈ హెచ్‌పివి టీకా ఎంతో కీలకమని,దీనిని అర్హులైన బాలికలందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.9 నుండి 14 ఏళ్ల వయస్సు గల బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పును సమర్థవంతంగా అడ్డుకోవచ్చని,తల్లిదండ్రులు ఎటువంటి అపోహలు లేకుండా తమ పిల్లలకు టీకాలు వేయించాలని కోరారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని,ఈ అవకాశాన్ని శంషాబాద్ మండలం,పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్,వైద్యులు,ఆరోగ్య సిబ్బంది,స్థానిక నాయకులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.




# యాదగిరిగుట్ట గిరి ప్రదక్షణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా మార్చి09(జర్నలిస్ట్ ఫైల్): శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కొండ చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభించి కొండ చుట్టూ వేలాది మంది భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 112 ఫిర్యాదులు స్వీకరణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి వచ్చిన 112 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మరియు ఇతర పోలీసు అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై సత్వరంగా స్పందించి, వాటిని నిర్ణీత సమయంలో చట్టపరంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకసారి వచ్చిన అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో విచారణ చేసి సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రజలకు భరోసా కల్పించే విధంగా వారి సమస్యల పరిష్కారాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని చట్ట పరిధిలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు పోలీసు శాఖపై విశ్వాసం పెంచేందుకు ఈ వేదికను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు, ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలకు సంబంధించిన పలు అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లకు అధికారులు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ప్రజల వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి చట్టపరంగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దిన్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌కు 514 అర్జీలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 514 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 317, పోలీస్ సూపరింటెండెంట్ పి.జి.ఆర్.ఎస్ కు 112 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 3 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 8 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 55, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 5 అర్జీలు అందాయి. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలితో కలిసి సోమవారం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పి.జి.ఆర్.ఎస్ లో అందిన ప్రతి అర్జీని పక్కాగా పరిష్కారం చేయాలన్నారు. పి.జి.ఆర్.ఎస్ ప్రాధాన్యత గుర్తించక జాప్యం చేయడం, అలసత్వం ఉండరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాదశాలను తనిఖీ చేసిన మఠాధిపతి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )**: జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం నందు అన్న ప్రసాదశాలను సందర్శించి అక్కడికి వచ్చిన భక్తులకి రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని భక్తులను అడిగి వివరాలు తెలుసుకోవడం జరిగింది. అంతే కాకుండా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేట్టు చూడాలని సిబ్బందికి సూచించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి తెలిపారు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు అనంతరం అక్కడ నిత్య అన్నదానానికి సంబంధించిన రసీదులను కూడా స్వామివారు తనిఖీ చేయడం జరిగింది.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం : ఎమ్మెల్యే నసీర్

- స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- కమ్యూనిటీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు నగరంలోని కాకాని రోడ్డు మంగళదాస్ నగర్ రిలయన్స్ సూపర్ మార్ట్ వెనక గల కమ్యూనిటీ హాల్ 2వ అంతస్తు నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు వేగంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఇక్కడ కమ్యూనిటీ హాల్ ను కోటి రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని, దీని కోసం శంకుస్థాపన చేశామని వెల్లడించారు. మూడు నెలల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కమ్యూనిటీ భవన్‌లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, దీనిలో మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని ఈ సందర్భంగా వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. వీటితోపాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 11 కోట్ల రూపాయల నిధులను పేద ప్రజలకు అందించామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను నిత్యం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా వెల్లడించారు.

## పన్ను వసూళ్లపై నగర రెవెన్యూ అధికారులు శ్రద్ధ చూపాలి

- సిబ్బందిని ఆదేశించిన కమిషనర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు మరింత శ్రద్ధ చూపాలని, త్రాగునీటి కుళాయి చార్జీలు, మీటర్ ట్యాప్ చార్జీలపై అధిక దృష్టి సారించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం కొరెటెపాడులోని పలు ప్రాంతాల్లో పన్ను వసూళ్ల ప్రక్రియ, మెయిన్ రోడ్ లోని పార్క్, కొరెటెపాడు చెరువు వాకింగ్ ట్రాక్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ కొరెటెపాడులోని పలు ప్రాంతాల్లో ఆస్తి పన్ను వసూళ్ల వివరాలను ఆర్ఓ, ఇన్స్పెక్టర్, అడ్మిన్ కార్యదర్శులను అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ మార్చి 2వ వారం కూడా గడుస్తున్నందున పన్ను వసూళ్లలో వేగం పెరగాలన్నారు. పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు ట్యాప్ డిస్ కనెక్షన్, పెద్ద మొత్తంలోని బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసి, సీజ్ కి చర్యలు తీసుకోవలని డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నీటి కుళాయి, మీటర్ చార్జీల వసూళ్లు నామమాత్రంగానే ఉన్నాయని, అడ్మిన్ లు పూర్తి స్థాయిలో విధుల్లో ఉండి, సచివాలయం పరిధిలో నూరు శాతం పన్ను వసూళ్లు లక్ష్యంగా కృషి చేయాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ ల్లో అద్దెలు చెల్లించని వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పారిశుధ్య పనులపై స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, గ్యాంగ్ వర్క్ లో డ్రైన్లలో తొలగించిన పూడికను 24 గంటల్లోగా తరలించాలని ఆదేశించారు. ఇళ్లలోనే తడిపొడిగా వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడంపై అవగాహన కల్గించాలని, ప్రతి డివిజన్ లో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్స్ ఏర్పాటు, హోమ్ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించాలని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ఉండడానికి వీలు లేదని, ఎస్ఎస్‌లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైన్లకు సమాంతరంగా ఉన్న త్రాగునీటి పైప్ లైన్లను గుర్తించి, వాటిని షిఫ్ట్ చేయడానికి ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొరెటెపాడు చెరువు వాకింగ్ ట్రాక్ ని పరిశీలించి, ట్రాక్ లో ఇప్పటికే నగరపాలక సంస్థ నుండి పలు అభివృద్ధి పనులు చేపట్టామని, స్థానిక వాకర్స్ కమిటీలు నిర్వహణ చూసుకోవాలని సూచించారు. వాకింగ్ ట్రాక్ వెంబడి ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, డిఈఈ రమేష్ బాబు, ఆర్ఓ మదన్ గోపాల్, ఎస్ఎస్ ప్రసాద్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంగలకుదురులో అరుదైన బరువున్న ఎన్టీఆర్ కాంస్య విగ్రహం

- త్వరలో ప్రారంభం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**: స్వర్గీయ నందమూరి తారకరాముడి అభిమానుల ఖిల్లా అంగళకుదురు గ్రామంలో ఎన్టీఆర్ కాంశ విగ్రహ ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా శిల్పుల వద్ద నుండి సజీవ శిల్పంగా మలచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఊరేగింపుగా అంగళకుదురు గ్రామానికి తరలించారు. గత సంవత్సరం డిశెంబర్ 27న, మండలంలోని అంగళకుదురు గ్రామం, పాత పంచాయతి కార్యాలయం సెంటర్ లో, ఎన్టీఆర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో, ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో, ఆరోజున పార్టీలోని విశిష్ట నాయకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, మహిళానేత నన్నపనేని రాజకుమారి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈక్రమంలో సోమవారం ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు మాజీ ఎమ్ పి పి సూర్యదేవర వెంకటెశ్వరరావు, హెచ్ సివి ఎమ్డీ కరణం వెంకటేశ్వరరావు, ఎన్నారై వల్లేపల్లి శ్రీనివాస్ ల, ఆధ్వర్యంలో, భారీ కాంశ్య విగ్రహాన్ని అంగళకుదురు కు, ఊరేగింపుగా తరలించారు. శిల్పకళా రంగంలో తెనాలికే గర్వకారణమైన సూర్యశిల్పశాల నిర్వాహకులు, కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కాంశ విగ్రహాన్ని, అరుదైన బరువుగల విగ్రహంగా రూపొందించడం ఇదేప్రథమం అని ఈసందర్భంగా తెలిపారు. సూర్యశిల్పశాల నుండి ఎన్టీఆర్ విగ్రహాన్ని, విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో, నిర్దేశించిన ప్రదేశంలో ప్రొక్లైనర్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటి బాధ్యులు, మాజీ ఎమ్ పిపి సూర్యదేవర వెంకట్రావ్, లక్ష్మీ న్నారాయణ, విగ్రహ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు లు వారి అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. విగ్రహం ఏర్పాటు వేడుకలో గ్రామసర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అలపర్తి సుధ, నలకుర్తి విజయ, సూర్యదేవర బోసు, అలపర్తి శ్రీకృష్ణ, చెన్నుపాటి లక్ష్మయ్య, టైలర్ శ్రీనివాస్, సుభాని, మద్దినేని తిరుమలేష్, కడియాల సుబ్బారావు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొని మిఠాయిలు పంపిణీ చేశారు.

## సోషల్ మీడియా ఫేక్ పోస్ట్‌ల కేసులో మరో వ్యక్తి అరెస్ట్

- రూరల్ సి ఐ. నాయబ్ రసుల్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**:సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులతొ మహిళల ప్రతిష్టను దిగజార్చే విధంగా ఫేక్ ఫేస్ బుక్ ఖాతాలను నడిపేవారిని ఉపేక్షించేది లేదని, టిడిపి మహిళా కార్యకర్త జెట్టి రేణుక కేసులో మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సి ఐ నాయబ్ రసూల్ పేర్కొన్నారు. మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన ఐ టిడిపి మహిళా కార్యకర్త జెట్టి రేణుక పై, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వారిలో, మరొకరిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు, రూరల్ సి ఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, సి ఐ షేక్ నాయబ్ రసూల్ వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా మద్దెలచెరువుకు చెందిన వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ మదిగుబ్బ అశోక్ ను, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వ్యవహారంలో, జెట్టి రేణుక మీద సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన కేసులో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సిఐ తెలిపారు. ఇదే వ్యవహారానికి సంబంధించి గతంలో బాపట్లకు చెందిన షేక్ సయ్యద్ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ చెప్పారు.

సోషల్ మీడియాలో పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా అసత్య ప్రచారంతో పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. అశోక్ ను ముసుగుతొ మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈసమావేశంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## ఐదుగురికి కారుణ్య నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సోమవారం ఐదుగురికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేస్తూ ఉద్యోగ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని అన్నారు. ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించడం ద్వారానే ఉద్యోగ విధులకు సంతృప్తి లభిస్తుందని చెప్పారు. నియామక పత్రాలు పొందిన వారిలో వేమూరి రాజా, పగిడిపల్లి కిషోర్ కుమార్, కూచిపూడి ప్రవీణ, నుసం నవీన, ఉండవల్లి వెంకటేష్ ఉన్నారు.

వేమూరు రాజాకు, కిషోర్ కుమార్ కు పోలీస్ శాఖలో జూనియర్ సహాయకులుగాను, కూచిపూడి ప్రవీణకు, నవీనకు రెవిన్యూ శాఖలో జూనియర్ సహాయకులుగాను, వెంకటేష్ కు స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్ లోను టైపిస్ట్ గా నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ఉన్నారు.

## అంబరాన్ని తాకిన క్రికెట్ అభిమానుల సంబరాలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**:భారత్ క్రికెట్ టీమ్ టిట్వంటీ మ్యాచ్ లో వరల్డ్ కప్ సాధించిన నేపథ్యంలో క్రికెట్ క్రీడాభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన టిట్వంటీ వరల్డ్ కప్ టోర్న మెంట్ లో, న్యూజిలాండ్ పై తలపడిన భారత్, 255 పరుగులతో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, తెనాలిలో అర్ధరాత్రి క్రికెట్ అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి. పట్టణంలోని పలు కూడళ్ళను కలుపుకుంటు, ద్విచక్ర వాహనాలపై, కోలాహలంగా, భారత్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మువ్వన్నెల జాతీయ జెండాతొ, జై భారత్ అంటూ నినాదాలు చేశారు. యువత తమ ఆనందాన్ని మీడియాతొ పంచుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు.

## పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి : చీఫ్ విప్ జీవీ




**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ )**:సీఎం సహాయనిది పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 56 మంది లబ్ధిదారులకు, 33 లక్షలు 92 వేలు చెక్కులను సోమవారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇక్బాల్ సుతానాకు మందులు అందజేసిన జెసి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు ఆనందపేట ఎనిమిదవ లైన్ కు చెందిన ఇక్బాల్ సుతానా రెండు ఊపిరితిత్తులు పనిచేయక వైద్యపరంగా అమర్చిన పరికరంతో జీవిస్తున్నారు. ఆమె కుమారుడు ఫిబ్రవరి 23న జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు సుతానాను తీసుకురావడంతో, ఆమె వివరాలు తెలుసుకుని వెంటనే జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా నేరుగా వెళ్లి అర్జీని తీసుకున్నారు. వైద్య పింఛను కింద మంజూరుకు చర్యలు తీసుకోవాలని, మందులు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. మందులు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ వర్సిటీకి ఎన్‌సీటీఈ నుంచి ఐటీఈపీ కోర్సుకు అనుమతి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నుంచి ప్రతిష్ఠాత్మకమైన ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ) కోర్సు ప్రారంభానికి అనుమతి లభించిందని వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ సోమవారం తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సీటీఈ నుంచి ఐటీఈపీ కోర్సును 2026--27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు అనుమతి లభించిందని తెలిపారు. ఈ అనుమతితో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) – 2020 అమలులో ముందంజలో నిలిచే విద్యాసంస్థలలో ఒకటిగా నిలిచిందన్నారు.

ఐటీఈపీ కోర్సు నాలుగేళ్ల సమగ్ర అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుగా రూపొందించబడిందని తెలిపారు. ఇందులో బీ.ఏ.–బీ.ఎడ్. మరియు బీ.ఎస్సీ.–బీ.ఎడ్. వంటి రెండు ప్రధాన విభాగాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సాధారణంగా బీ.ఎడ్. చదవడానికి విద్యార్థులు ముందుగా మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసి తర్వాత రెండు సంవత్సరాల బీ.ఎడ్. కోర్సు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఐటీఈపీ ద్వారా విద్యార్థులు ఒకే సమయంలో తమ ప్రధాన సబ్జెక్ట్‌లో డిగ్రీతో పాటు బోధనలో అవసరమైన శిక్షణను కూడా పొందుతూ ఒక సంవత్సరం సమయాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు.

ఈ సందర్భంగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఐటీఈపీ ద్వారా మేము కేవలం ఉపాధ్యాయులను తయారు చేయడం మాత్రమే కాదు, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే 'దేశ నిర్మాతలను' తయారు చేయడమే మా లక్ష్యమని తెలిపారు. ఈ మల్టీ డిసిప్లినరీ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సబ్జెక్టు పరిజ్ఞానం మరియు బోధన పద్ధతుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించుకుంటారని పేర్కొన్నారు. 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు.

ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ ఐటీఈపీ అనుమతి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యా నాణ్యతకు ఇచ్చిన ప్రాముఖ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ శిక్షణ పొందే విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కల్పించేందుకు విశ్వవిద్యాలయం ప్రత్యేక ల్యాబొరేటరీలు, రిసోర్స్ సెంటర్లు మరియు అనుభవాత్మక బోధన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఐటీఈపీ ద్వారా విద్యార్థులు నాలుగేళ్లలోనే ద్యూయల్ డిగ్రీ ప్రయోజనం పొందగలుగుతారన్నారు. అంటే తమ ఎంపిక చేసిన సబ్జెక్టులో డిగ్రీతో పాటు ప్రొఫెషనల్ టీచింగ్ క్వాలిఫికేషన్‌ను కూడా పొందే అవకాశం ఉంటుందని వివరించారు. సాధారణంగా అయిదేళ్లు పట్టే ఈ ప్రక్రియను నాలుగేళ్లలో పూర్తి చేయడం విద్యార్థులకు పెద్ద ప్రయోజనంగా నిలుస్తుందని అన్నారు.

ఈ కోర్సులో ప్రవేశాలు నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) ఆధారంగా జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుందని చెప్పారు. ఐటీఈపీ కోర్సు పాఠ్య ప్రణాళికను న్యూ నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీఎఫ్‌టీఈ) ప్రకారం రూపొందించినట్లు తెలిపారు. ఇందులో సబ్జెక్టు పరిజ్ఞానం, బోధనా నైపుణ్యాలు, సాంకేతిక వినియోగం, సమాజంతో అనుసంధానం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు.

విద్యారంగంలో నాణ్యతతో కూడిన ఉపాధ్యాయులను తయారు చేయడం, పాఠశాల విద్యలో నూతన బోధనా విధానాలను ప్రోత్సహించడం, విద్యార్థులలో పరిశోధనా దృక్పథం పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఐటీఈపీ కార్యక్రమం అమలు చేయబడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రం మరియు దేశవ్యాప్తంగా విద్యా రంగానికి సమర్థవంతమైన, నైపుణ్యంతో కూడిన ఉపాధ్యాయులు అందుబాటులోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.

ఈ కొత్త కార్యక్రమం ప్రారంభంతో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యాయ విద్యా రంగంలో మరో కీలక అడుగు ముందుకు వేసిందని, భవిష్యత్తులో దేశ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయడంలో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. అనంతరం నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నుంచి ప్రతిష్ఠాత్మకమైన ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ) కోర్సు ప్రారంభానికి అనుమతులు సాధించిన అధ్యాపక బృందాన్ని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు సంప్రదాయం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):**పవిత్ర రంజాన్ మాసంలో ప్రజలందరిపై అల్లా ఆశీస్సులు ఉండాలని, మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు సంప్రదాయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక మారీసుపేటలోని 22వ, వార్డు పరిదిలో, టిడిపి మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ సుభాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లీమ్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో, తొలుత స్థానిక నాయకులు ముస్లిం సోదరులుఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు, ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్ష చేస్తూ అల్లాను ప్రార్థిస్తూ ఉంటారని, ముస్లీమ్ సోదరులకు అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మత సామరస్యాన్ని చాటి చెప్పే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొనడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలొ స్థానిక పార్టీ నాయకులు రావి చిన్ని, కోగంటి రోహిత్, మంగమూరి హరిప్రసాద్, మహ్మద్ కుద్దూస్ తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కృష్ణానది కుడి వైపు రిటైనింగ్ వాల్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన



### ○ రూ.294.20 కోట్లతో వరద రక్షణ గోడ నిర్మాణం
### మరో ఎన్నికల హామీ నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మహానాడు ప్రాంత ప్రజల దశాబ్దాల కలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నెరవేర్చారు. తాడేపల్లి పట్టణం సీతానగరం మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి లోకేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన 0.9కి.మీ నుంచి 2.610కి.మీల వరకు కృష్ణానది కుడివైపు రూ. 294.20 కోట్లతో వరద రక్షణ గోడను నిర్మించనున్నారు.

**ఎన్నికల హామీని నిలబెట్టుకున్న మంత్రి లోకేష్**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేష్ పెద్దపీట వేశారు. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే రూ. 294.20 కోట్ల పరిపాలన అనుమతులు సాధించడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని సైతం తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారు. కేవలం సాధారణ గోడ కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, పైల్-రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలను, నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే సుందరయ్య నగర్, మహానాడు కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50వేల మంది ప్రజలు వరద భయం నుంచి శాశ్వతంగా విముక్తి పొందుతారు. అమరావతి రాజధాని పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రక్షణగా రిటైనింగ్ వాల్ నిలవనుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, తాడేపల్లి టౌన్ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## నందం అబద్దయ్య మనవడి వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్



**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య మనవడి వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. సోమవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు రోహిత్ బాబు, శ్రీ విజయలక్ష్మిలను ఆశీర్వదించారు.

వైవాహిక జీవితంలోకి అడుగు పెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్టేట్ ఓపెన్ టెన్నిస్‌లో రన్నర్స్‌గా గుంటూరు వాసులు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** స్టేట్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ లో 60 ప్లస్ కేటగిరిలో గుంటూరుకు చెందిన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ చుక్కా విల్సన్ బాబు, రిటైర్డ్ పోలీసు డీఎస్పీ పి.విజయసారధి రన్నర్స్ గా విజయం సాధించారు. ఒంగోలు హైదరి ఆఫీసర్స్ క్లబ్ లో ఆదివారం జరిగిన పోటీలలో రాష్ట్ర స్థాయిలో ఎంతో మంది విశ్రాంత ఉన్నతాధికారులు పాల్గొనగా, అందులో చుక్కా విల్సన్ బాబు, విజయసారధి ఫైనల్లో రన్నర్స్ గా మిగిలారు. వీరికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి బహుమతులు అందచేసారు. పోలీసు, జీఎస్టీ శాఖలకు చెందిన పలువురు ఉద్యోగులు ఇరువురికి అభినందనలు తెలిపారు.

# లోకేష్ ఇలాకాలో అభివృద్ధిపనుల ప్రారంభోత్సవాలు

- ○ మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ విస్తృత పర్యటన
- ○ రూ.294.20 కోట్లతో కృష్ణానది కుడివైపు వరద రక్షణ గోడ నిర్మాణంకు శంకుస్థాపన
- ○ తాడేపల్లి నులకపేటలో 65 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభం
- ○ రూ. 14.88 కోట్లతో పెదవడ్లపూడి నిర్మించిన హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకం ప్రారంభం
- ○ పెనుమూలిలో 22 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభం
- ○ దుగ్గిరాలలో 61 లక్షలతో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనం ప్రారంభం
- ○ శిలా ఫలకాల ఆవిష్కరణలు, రామాలయంలో ప్రత్యేక పూజలు
- ○ రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరించిన నారా లోకేష్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంత్రి నారా లోకేష్ సోంత నియోజకవర్గమైన మంగళగిరి లో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్ని నారా లోకేష్ విస్తృత పర్యటనలు నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి సీతానగరం మహనాడు వద్ద రూ. 294.20 కోట్లతో కృష్ణానది కుడివైపు వరద రక్షణ గోడ నిర్మాణంకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్దాపన చేశారు. శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం తాడేపల్లి నులకపేటలో శ్రీరంగం ఫౌండేషన్ సహకారంతో రూ. 65 లక్షల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను రిబ్బన్ కట్ చేసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.చంద్ర కిరణ్ రెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

**రూ. 14.88 కోట్లతో పెదవడ్లపూడి నిర్మించిన హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకం ప్రారంభం**

అనంతరం మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో రూ. 14.88 కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి పంపుల ద్వారా నీటి పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాదాపు 250 క్యూసెక్కుల నీటి విడుదల పరిమాణం కలిగిన ఈ పథకం ద్వారా మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని 25,344 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంపులను అమర్చారు. ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను పూర్తిచేయించారు.

**పెనుమూలిలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్**

దుగ్గిరాల మండలం పెనుమూలిలో రూ. 22 లక్షల నిధులు వెచ్చించి పునర్ నిర్మించిన గ్రామీణ గ్రంథాలయ భవనాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. లైబ్రరీని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించిన మంత్రి లోకేష్**

దుగ్గిరాలలో రూ. 61 లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన అన్న క్యాంటీన్ నూతన భవనాన్ని ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం అక్షయపాత్ర సిబ్బందితో కలిసి మంత్రి లోకేష్ సామాన్య ప్రజానీకానికి భోజనం వడ్డించారు.

**దుగ్గిరాలలో రామాలయంలో ప్రత్యేక పూజలు**

దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించిన అనంతరం స్థానికంగా యాదవపాలెంలో ఉన్న శ్రీ కోదండ రామచంద్రస్వామి మందిరాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ**

దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో భారీ ర్యాలీ మధ్య స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ, దుగ్గిరాల, మంగళగిరి పట్టణ, రూరల్ టిడిపి పార్టీ అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, వల్లభనేని వెంకట్రావు, పల్లబోతుల శ్రీనివాసరావు, పడవల మహేష్ రాష్ట్ర, వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు దుగ్గిరాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాసరనేని జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

### ○ బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమం

**గుంటూరు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు పట్టణంలోని వెంగయ్య కాలనీలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారికి మెమెంటోలు, చీరలు పంపిణీ చేశారు.

సన్మానం పొందిన మహిళా కార్మికులు మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని



ప్రశంసించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేద్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, జోనల్ ఇంచార్జ్



మేకల లక్ష్మణ్, పల్నాడు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మధుబాబు పాల్గొన్నారు.

అలాగే ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు అబ్రహం, ఏసు బాబు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పెరికల ఆనంద రాజు, నాయకులు బొందలపాటి చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో తెగిన చేతికి పునర్జీవం

### ○ ఎయిమ్స్ మంగళగిరి వైద్యుల అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా భుజం స్థాయిలో మోచేతిపైన తెగిన చేతిని తిరిగి జోడించే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. అత్యాధునిక సూక్ష్మ శస్త్ర విధానంతో నిర్వహించిన ఈ అరుదైన శస్త్రచికిత్స రాష్ట్రంలో వైద్య రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. జార్ఖండ్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడు రహదారి నిర్మాణ సంస్థలో యంత్రాల నిర్వహణలో పని చేస్తున్నాడు. ఈ నెల 22న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో హనుమన్ జంక్షన్ సమీపంలో తారు యంత్రంలో ఇరుక్కుపోవడంతో అతని ఎడమ చేయి తీవ్రంగా నుజ్జునుజ్జయింది. అనంతరం గాయపడిన వ్యక్తిని వెంటనే మంగళగిరిలోని ఎయిమ్స్ అత్యవసర విభాగానికి తరలించారు. గాయం తీవ్రతను పరిశీలించిన వైద్య బృందం అత్యవసరంగా శస్త్రచికిత్స చేపట్టింది. గాయమైన ఆరు గంటలలోపు రక్తప్రసరణను పునరుద్ధరించకపోతే అవయవం నిలవదని భావించి వెంటనే పునఃస్థాపన చర్యలు ప్రారంభించారు.

**అరుదైన శస్త్రచికిత్స రాష్ట్రంలో వైద్య రంగానికి మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది**

డాక్టర్ శాంతకుమార్ శివలింగప్ప నేతృత్వంలోని ప్లాస్టిక్ శస్త్రచికిత్స బృందం, డాక్టర్ లిఖిత రెడ్డి, డాక్టర్ మనోజ్ నేతృత్వంలోని ఎముకల శస్త్రచికిత్స బృందం, గుండె-రక్తనాళ శస్త్ర విభాగం మరియు మత్తు వైద్య విభాగాల సహకారంతో సుమారు ఎనిమిది గంటలపాటు ఈ శస్త్రచికిత్స కొనసాగింది. ప్రధాన రక్తనాళాలను పునర్నిర్మించడం, ఎముకను స్థిరపరచడం, కండరాలు మరియు మృదు కణజాలాలను సరిచేయడం ద్వారా తెగిన చేతిని తిరిగి జోడించారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని



14 రోజుల పాటు ప్రత్యేక సంరక్షణ విభాగంలో నిశితంగా పరిశీలించారు. ఐదు రోజుల తర్వాత చేయిపై ఉన్న గాయాన్ని చర్మ మార్పిడి ద్వారా కప్పారు. నరాలు తీవ్రంగా దెబ్బతిన్నందున తరువాతి దశలో నరాల పునర్నిర్మాణం మరియు ఎముక స్థిరీకరణ కోసం మరో శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు.

**వైద్య బృందానికి అభినందనలు**

ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందాన్ని ఎయిమ్స్ మంగళగిరి కార్యనిర్వాహక అధికారి ప్రొఫెసర్ డాక్టర్ అహంతెం శాంతా సింగ్ అభినందించారు. ఈ కేసు ఎయిమ్స్ మంగళగిరిలో ఉన్న అధునాతన ప్రమాద చికిత్సా సామర్థ్యాన్ని, పునర్నిర్మాణ శస్త్రచికిత్సలో ఉన్న నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

## కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావుకు తీవ్ర అస్వస్థత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు (82) తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ లోని స్టార్ ఆస్పత్రిలో కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నట్లు తెలిపాయి. 1943లో పుట్టిన ఆయన వరంగల్ నిట్ లో డిగ్రీ పొందారు. ఐదుసార్లు ఎంపీగా, ఒక సారి కేంద్ర జౌళిశాఖ మంత్రిగా కావూరి సాంబశివరావు సేవలందించారు. 1984,1989, 1998 ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి లోక్ సభ స్థానానికి పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత 2004, 2009 సంవత్సరాల్లో ఏలూరు లోక్ సభ స్థానం నుంచి



గెలిచారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో జౌళిశాఖ మంత్రిగా సేవలందించారు. మొత్తంగా 8,9,12,14,15 లోక్ సభలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. 2014 వరకూ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా ఉన్న ఆయన.. రాష్ట్ర విభజన తర్వాత బీజేపీలో చేరారు. అప్పటి నుంచి ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరనే చెప్పాలి. కాగా.. కావూరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. విశాఖపట్నం ఎంపీ, నందమూరి బాలకృష్ణ చిన్నల్లుడు భరత్.. స్వయానా ఈయన కూతురి కొడుకే. ఏపీ మంత్రి నారా లోకేష్ ఇటీవలే ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పరామర్శించినట్లు తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## త్రాగునీటి సమస్యల పరిష్కారం అజెండాగా బీజేపీ జనతా వారధి



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ జనతా వారధి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. బీజేపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, జనతా వారధి కన్వీనర్ తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నగర ప్రజలకు తగినంత త్రాగునీటిని సరఫరా చేయాలని, పగిలిన నీటి పైపులను త్వరితగతిన మరమ్మతు చేయాలని, నీటి శుద్ధి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని వారు కోరారు. అలాగే సామాన్య ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలకు సంబంధించిన అర్జీలను డిప్యూటీ కలెక్టర్‌కు అందజేసి వివరించారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశిస్తామని డిప్యూటీ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనతా వారధి టీం సభ్యులు కత్తి మేరీ సరోజిని, షేక్ సాంబశివరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేసు సత్యనారాయణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియలో భాగంగా, వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథుగా పాల్గొన్నారు. రీసర్వే పూర్తయిన రైతులకు, ప్రజల ఆస్తులకు సంబంధించి ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను వారు స్వయంగా పంపిణీ చేశారు రీసర్వే ద్వారా భూ వివాదాలు తొలగిపోతాయని, రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు లభిస్తాయని జీవీ గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ రాజముద్రతో జారీ చేసిన ఈ పాస్ పుస్తకాలు రైతులకు కొండంత అండగా ఉంటాయని తెలిపారు. అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా పథంలో సరికొత్త రికార్డు..19 నెలల్లో 673 మందికి రూ. 5.12 కోట్ల లబ్ధి : మంత్రి కందుల దుర్గేష్

- ○ పేదవాడి గుండె ధైర్యం.. ముఖ్యమంత్రి సహాయనిధి అని పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్
- ○ నిడదవోలు క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ.26.32 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ వోసీ పత్రాలు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :**"కన్నీరు తుడిచే చేయి.. కష్టం తీర్చే గుండె.. కూటమి ప్రభుత్వానికి నిరంతర ఆయుధాలు" అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటించారు. నిరుపేదల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా, ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవనిలా మారుతోందని ఆయన అభివర్ణించారు. సోమవారం నిడదవోలులోని తన క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ. 26,32,753 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మరియు ఎల్ వోసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా పంపిణీ చేశారు. అందులో 35 మందికి రూ. 19,76,689 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ముగ్గురికి రూ. 6,56,064 విలువైన ఎల్ వోసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, గత 19 నెలల కాలంలో నిడదవోలు నియోజకవర్గంలో అక్షరాలా 673 మందికి రూ. 5,12,20,251 లబ్ధి చేకూర్చామని సగర్వంగా ప్రకటించారు. "ప్రతి 15 రోజులకొకసారి పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించడం నా రాజకీయ జీవితానికి లభిస్తున్న అసలైన సంతృప్తి" అని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు. వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్న కుటుంబాలకు ఈ నిధులు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల నుంచి పుట్టిన విప్లవాత్మక మార్పును మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య భీమా కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయని, ఇది 5 కోట్ల ఆంధ్రుల జీవితాలకు కొండంత అండగా నిలుస్తుందని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పమని గుర్తు చేశారు.

కార్పొరేట్ స్థాయి వైద్యం తమకు ఉచితంగా అందేలా చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు లబ్ధిదారులు నిండు మనసుతో ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో అండగా నిలిచిన నేతలను వారు ఆశీర్వదించడం కార్యక్రమానికి ఒక ప్రత్యేక శోభను చేకూర్చింది.

ప్రభుత్వం చేస్తున్న ఈ మంచి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములై, సమాజ పునర్నిర్మాణానికి సహకరించాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467